ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 22 అక్టోబరు 2024

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

- విజయనగరం జిల్లా పర్యటన అనంతరం తిరుగు ప్రయాణంలో రుషికొండపై భవనాలు పరిశీలన

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సోమవారం విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియా బాధిత కుటుంబాలను పరామర్శించడానికి విజయవాడ నుంచి ఉదయం పది గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న పవన్ కల్యాణ్‌కు ఎంపీ ఎం.శ్రీభరత్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, గ్రేటర్ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో విజయనగరం వెళ్లారు. అక్కడ నుంచి తిరుగు ప్రయాణంలో రుషికొండను సందర్శించారు. ఎంపీ ఎం.శ్రీభరత్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జనసేన నాయకులతో కలిసి ఆ భవనాన్ని బయట నుంచే ఆమూలాగ్రం చూశారు. భవనానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెప్పించుకొని ఏమి చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని పార్టీ నాయకులకు చెప్పారు. అనంతరం ఐదు గంటలకు విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడ వెళ్లారు.



రుషికొండపై భవనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే సుందరపు

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని, ప్రతి ఒక్కరూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అమరుల స్మృతి స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో

... మిగతా 8వ పేజీలో



పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

తుఫాన్‌తో అప్రమత్తం

మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

- 26వ తేదీ వరకు పనిచేస్తున్న కేంద్రాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశం
- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్
- ఫోన్ నంబర్లు: **08924-226599, 08924-222888**
- 24 గంటలూ అందుబాటులో సిబ్బంది

అనకాపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మరో రెండు, రోజు మూడు రోజుల్లో బంగాళాతంలో తుఫాన్ ఏర్పడి, ఒడిశా- పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటుతుందన్న వాతావరణ శాఖ సమాచారంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంమైంది. తూర్పుమధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడి సోమవారం తీవ్ర అల్పపీడనంగా మారిందని, అనంతరం వాయుగుండంగా బలపడి తుఫాన్‌గా మారనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుఫాన్ కారణంగా రానున్న రెండు, మూడు రోజుల్లో అనకాపల్లి జిల్లాలో భారీ వర్షాలు కురిస్తే అవకాశం వుంది. సోమవారం జిల్లా వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. సోమవారం జేసీ జాహ్నవితో కలిసి కలెక్టరేట్ నుంచి కార్యాలయం నుంచి మండల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు నివాస ప్రాంతాలు ముంపునకు గురైతే తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా వుండాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఓలు, సీహెచ్‌డబ్ల్యూఓలు, సచివాలయాల సిబ్బంది తమ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల వల్ల తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉన్నందున నీటి ట్యాంకులు, పైపు లైన్‌లను తనిఖీ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల వాగులు, గెడ్డలు, నదులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున ... మిగతా 8వ పేజీలో



కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విధి నిర్వహణలో సిబ్బంది

నర్సీపట్నంలో భారీ వర్షం

నర్సీపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో సోమవారం సాయంత్రం గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. 4.30 గంటల నుంచి ఆరు గంటలు వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, శివపురం మెయిన్ రోడ్డులో నీరు పారడంతో వాహనదారులు ఇబ్బంది ఇబ్బంది పడ్డారు. వెంకునాయుడుపేట నుంచి బొంతువీధికి వెళ్లే స్కూల్ రోడ్డులో రెండు అడుగుల మేర నీరు నిలిచింది.



భారీ వర్షంతో జలమయమైన వెంకునాయుడుపేట

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- గంజాయి రవాణా నిరోధానికి ప్రత్యేక నిఘా
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా.. బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు, వాటిని ప్రోత్సహించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. విశాఖ నగర పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ-2గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇటీవల అనకాపల్లి జిల్లా ఎస్పీగా బదిలీ చేసింది. సోమవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘాను మరింత పెంచుతామని, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. 2021-22లో నర్సీపట్నం ఏఎస్పీగా పనిచేశానని, అందువల్ల ఈ జిల్లాపై పూర్తి అవగాహన ఉందన్నారు. గంజాయి రవాణా నిరోధానికి ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామమని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తామని ఎస్పీ చెప్పారు. అనంతరం పోలీసు అమర వీరుల స్థూపం వద్ద గౌరవ వందనం చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, డీఎస్పీలు అప్పారావు, కేవీ సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు బాలసూర్యారావు, లక్ష్మణమూర్తి, వినోద్‌బాబు, రమేశ్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో మందుల కొరత

కొన్ని మందులు బయట కొనుక్కోవాల్సిన పరిస్థితి

రోగులకు తప్పని ఇబ్బందులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో జిల్లా ఆస్పత్రి అయిన ఎన్టీఆర్ వైద్యాలయంలో మందుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యాలయానికి వచ్చే రోగులకు వైద్యులు వైద్యసేవలందించి మందులు రాస్తున్నా అందులో కొన్ని అందుబాటులో లేకపోవడంతో బయట మందుల దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తున్నదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎన్టీఆర్ వైద్యాలయం

ఎన్టీఆర్ వైద్యాలయానికి రోజూ వైద్యం కోసం 700 నుంచి 900 మంది వరకు రోగులు వస్తుంటారు. ఒక్క అనకాపల్లి నియోజకవర్గవాసులే కాకుండా పట్టణానికి ఆనుకుని ఉన్న పెందుర్తి, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాల్లోని పలు మండలాల నుంచి కూడా వస్తుంటారు. అయితే వారికి వైద్యులు మందుల చీటీ రాసి ఇస్తే కొన్ని మాత్రమే అక్కడ ఉచితంగా ఇస్తున్నారు. మిగతావి లేవని, బయట కొనుక్కోవాలని చెబుతున్నారు. గత కొద్ది రోజులుగా ఈ పరిస్థితి ఉంది. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ వైద్యం కోసం వచ్చే వారికి ఆ మందులు ఇక్కడ దొరకడం లేదు. ముఖ్యంగా యాంటీబయాటిక్ ఇంజక్షన్లు, మాత్రలు, బి కాంప్లెక్స్, సిట్రజన్, ఏవిల్ వంటి ఇంజక్షన్లు, మాత్రలు అందడం లేదని రోగులు చెబుతున్నారు. సర్జికల్ పరికరాలు కూడా ఆశించిన మేరకు అందుబాటులో లేవు. సర్జికల్స్‌కు ప్రతి ఏటా 33 లక్షల రూపాయల బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. అయితే గతేడాది రూ.21 లక్షలు కేటాయించగా, ఈ ఏడాది ఇప్పటి వరకు రూ. ఐదు లక్షలే మంజూరైనట్టు వైద్యాధికారుల ద్వారా తెలిసింది. అలాగే మందులకు ఏటా రూ.కోటి 22 లక్షలు బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా, గతేడాది రూ.కోటి ఆరు లక్షలు మాత్రమే ... మిగతా 8వ పేజీలో



మందుల కోసం క్యూలో ఉన్న రోగులు

మహిళలకు దీపావళి కానుక!

ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు

- వివరాలు సేకరిస్తున్న పౌరసరఫరాల అధికారులు
- కూటమి ప్రభుత్వ ప్రకటనపై హర్షాతిరేకాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

మహిళలకు బాసటగా నిలిచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దీపావళి నుంచి ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించనుంది. ఈ మేరకు శాసనసభా పక్ష సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్-6 హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నది. తెల్ల రేషన్ కార్డులున్న ప్రతి కుటుంబానికి ఏటా మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న హామీ ప్రకారం మహిళలకు దీపావళి పండుగ నుంచి ఉచిత కానుకలు అందించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అర్హుల జాబితాల రూపకల్పనలో నిమగ్నమయ్యారు. తెల్ల రేషన్‌కార్డుదారుల్లో ఏం కంపెనీ గ్యాస్‌ను ఎంతమంది వినియోగిస్తున్నారో వివరాలు సేకరిస్తున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంపై మహిళల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండరు ధర రూ.850 వుంది. ఇందులో రూ.10.62లను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా తిరిగి గ్యాస్ కనెక్షన్‌దారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నది. కాగా గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం దీపావళి నుంచి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా సరఫరా చేయాలని నిర్ణయించింది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి రూ.2,520 వరకు ఆదా అవుతుంది. జిల్లాలో జనరల్ కేటగిరీలో సింగిల్ సిలిండర్ కనెక్షన్‌లు 1,47,695, డబుల్ సిలిండర్ల కనెక్షన్‌లు 1,00057, దీపం కనెక్షన్లు 1,77,149, ఉజ్వల కనెక్షన్లు 7,391, ఉజ్వల-2.0 కనెక్షన్లు 9,645, సీఎస్ఆర్ కనెక్షన్లు 45,556.. మొత్తం 4,87,034 వంట గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. వీరిలో తెల్ల రేషన్‌కార్డు వుండి, అర్హులైన వారందరికీ ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తారు. దీనిపై ఈ నెల 23న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదిస్తామని, విధి విధానాలను కూడా త్వరలో వెల్లడిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం తెనాలిలో నిర్వహించిన మీడియా సమావేశంలో చెప్పారు. కాగా జిల్లాలో ఏ కేటగిరీ కింద ఎన్ని వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయో వివరాలు సేకరిస్తున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి మూర్తి తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాలకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని చెప్పారు.



యూకలిప్టస్ చెట్లు నరికివేత వాస్తవమే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- నర్సీపట్నం ఫారెస్ట్ రేంజర్ లక్ష్మీనర్సు
- 'అడవిపై గొడ్డలి వేటు' కథనంతో అటవీ శాఖలో కదలిక
- విచారణ జరపాలని డీఎఫ్‌వో ఆదేశం



యూకలిప్టస్ చెట్లు నరికిన మొదళ్లను పరిశీలిస్తున్న రేంజర్, సెక్షన్ ఆఫీసర్

కోటవురట్ల, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడపాలెం, నీలిగుంట అటవీప్రాంతంలో యూకలిప్టస్ ప్లాంటేషన్‌లో అక్రమంగా చెట్లు నరికివేసి, కలపను తరలించడం వాస్తవమేనని నర్సీపట్నం ఫారెస్ట్ రేంజర్ లక్ష్మీనర్సు చెప్పారు. 'అడవిపై గొడ్డలి వేటు' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌వో) శామ్యూల్ స్పందించారు. వెంటనే అటవీ ప్రాంతానికి వెళ్లి విచారణ జరపాలని నర్సీపట్నం రేంజ్ అధికారులను ఆదేశించారు. దీంతో నర్సీపట్నం రేంజర్ లక్ష్మీనర్సు, కోటవురట్ల ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ అప్పారావు కలిసి సోమవారం బోడపాలెం, నీలిగుంట గ్రామాల మధ్యలోగల పట్టాలమ్మగుడి కొండ అటవీ ప్రాంతంలో యూకలిప్టస్ ప్లాంటేషన్‌కు వెళ్లారు. అక్రమార్కులు నరికివేసిన చెట్ల మొదళ్లను పరిశీలించారు. ఆయా చెట్లకు కొలతలు తీసి నమోదు చేశారు. ఈ సందర్భంగా రేంజర్ లక్ష్మీనర్సు మాట్లాడుతూ, యూకలిప్టస్ చెట్లను నరికి, కలపను తరలించుకుపోయిన నిందితులను పట్టుకుంటామని చెప్పారు. తమ సిబ్బందితో ప్లాంటేషన్‌కు అన్నివైపులా నిఘా పెడతామన్నారు. యూకలిప్టస్ చెట్ల నరికివేతపై నివేదికను డీఎఫ్‌వోకు అందజేయనున్నట్టు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

- జిల్లాలో మేజర్ కమిటీ-1, ప్రాజెక్టు కమిటీలు-4, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు-3, నీటి వినియోగదారుల సంఘాలు-303
- వచ్చే నెల29వ తేదీ వరకు దశల వారీగా పోలింగ్
- కలెక్టర్ విజయకృష్ణన్



విజయకృష్ణన్, కలెక్టర్

అనకాపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల వివరాలను వెల్లడించారు. జిల్లాలో పెద్ద తరహా సాగునీటి ప్రాజెక్టు కింద తాండవ జలాశయం ఉందని, ప్రాజెక్టు కమిటీలు 4, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 3, నీటి వినియోగదారుల సంఘాలు 303 ఉన్నాయని వివరించారు. ఆయా సంఘాలకు ఈ నెల 21వ తేదీ నుంచి నవంబరు 29వ తేదీ వరకు వివిధ దశల్లో ఎన్నికల ప్రక్రియ వుంటుందన్నారు. ఓటర్ల జాబితాల రూపకల్పన జరుగుతున్నదని, ఇంత వరకు ఎన్నికలు జరగని పెద్దేరు జలాశయం పరిధిలో కొత్తగా ఓటర్ల జాబితా తయారు చేయాలని ఆదేశించామని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి 668 మంది గెజిటెడ్ అధికారులను, 1,530 మంది పోలింగ్ సిబ్బందిని నియమించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశానికి నీటిపారుదల శాఖ ఈఈ ఎ.త్రినాథన్, డీఈఈ రాజేంద్రకుమార్ తదితరులు హాజరయ్యారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



కాగిత దుర్గాదేవి ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగిత గ్రామంలో దుర్గాదేవి ఆలయ 15వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఏకాహం, భజన కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం అన్నదానం చేస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులు

పాయకరావుపేట, అక్టోబరు 21: ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 బాలురు, బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 18న జరిగిన అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అదేవిధంగా బాలికల విభాగంలో ఎంపికైన ఐదుగురు విద్యార్థులు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అభినందనలు తెలిపారు.

పథకాల ప్రచారంలో వీవోఏల పాత్ర కీలకం

- ఎంపీడీవో సీతారామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో వెలుగు వీవోఏలు కీలకంగా వ్యవహరించాలని ఎంపీడీవో డి.సీతారామరాజు చెప్పారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల స్థాయి వీవోఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం ద్వారా గ్రామంలో నిరక్షరాస్యులని పంచాయతీకి 20 మంది చొప్పున గుర్తించి, వారికి ఒక వలంటీర్ ద్వారా ప్రాథమిక విద్య, డిజిటల్ విద్యపై శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు రాజు, అప్పారావు, కోటి, సన్యాసిరావు, ప్రసాద్, దీవినమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన దృశ్యం

ఎస్.రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ అందజేసిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సోమవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వింగ్స్ ఫౌండేషన్ డైరెక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థుల అవసరాలు తమ దృష్టికి తీసుకువస్తే సాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక, పెదబోదిగల్లం హైస్కూళ్ల విద్యార్థులకు పుస్తకాల వితరణ



ఏటికొప్పాక విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాజ్‌కమాల్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఎలమంచిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏటికొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాలకు చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. రాజ్‌కమాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎర్రమిల్లి జయరాం సమకూర్చిన మెటీరియల్‌ను 30 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ మెటీరియల్‌ను ఉపయోగించి విద్యార్థులు మరింత రాణించాలని హెచ్‌ఎం కేవీ సత్యనారాయణ, ఫౌండేషన్ సెక్రటరీ ఎం. జయప్రకాష్ విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని పెదబోదిగల్లం జడ్పీ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే 8వ తరగతి విద్యార్థులకు సోమవారం రాజ్‌కమల్, వింగ్స్ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం సీహెచ్ సత్యనారాయణ నేతృత్వంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సంస్థల ప్రతినిధులు జయరాం, జయప్రకాశ్ వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారి, ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఫల్గుణరావు, శ్రీదేవి పాల్గొన్నారు.

గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 21: గుంటూరులో సోమవారం ప్రారంభమైన ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ రీజనల్ లెవెల్ వర్క్‌షాపులో పాల్గొన్న ఏపీ గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబును రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ పి.రాజబాబు సత్కరించారు.

చినగుమ్ములూరులో క్షీణించిన పారిశుద్ధ్యం

- గ్రామంలో ఎక్కడ చూసిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలే
- దోమల స్వైరవిహారంతో గ్రామస్థులు బెంబేలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఎస్.రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ ఉన్నతాధికారులు పదే పదే ఆదేశాలు జారీ చేస్తున్నా స్థానిక అధికారులు వాటిని బేఖాతరు చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను చేయించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

మండలంలోని చినగుమ్ములూరు గ్రామంలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. ఎక్కడ చూసినా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే రకరకాల ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త వేస్తున్నారు. ఒక విధంగా చూస్తే డంపింగ్ యార్డును తలపిస్తున్నది. ఆ చెత్త, వ్యర్థాలు గొయ్యిలో ఉన్న నీటిలో తడుస్తున్నాయి. దీంతో వాటి ద్వారా దుర్వాసన వెదజల్లడమే కాకుండా అధికంగా దోమల వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. నర్సీపట్నం రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు మార్గం పక్కనే చెత్తతోపాటు పలు చోట్ల వాడి పడేసిన ఖాళీ గ్లాసులు, ప్లాస్టిక్ బాటిళ్లు ఎక్కడిక్కడే దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య పనుల విషయంలో పంచాయతీ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్థులు మండిపడుతున్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.



నర్సీపట్నం రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు పక్కన పేరుకుపోయి ఉన్న చెత్త



కుప్పగా పోసిన ప్లాస్టిక్ గ్లాసులు

సాగునీటి కాలువ కబ్జా

- పెదరాంభద్రపురంలో దర్జాగా షెడ్డు నిర్మాణం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారులు ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలాలనే కాదు.. ఏకంగా సాగునీటి కాలువల గట్లను కూడా కబ్జా చేస్తున్నారు. కాలువను సిమెంట్ తూరలతో కప్పేసి, ఆపైన పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. మండలంలోని పెదరాంభద్రపురం పంచాయతీలో సాగునీటి కాలువను ఓ వ్యక్తి దర్జాగా ఆక్రమించి షెడ్డు నిర్మించాడు. ఇది సత్యవరం నుంచి శ్రీరాంపురం వెళ్లే ప్రధాన రహదారి పక్కన వున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. పంట కాలువను ఆక్రమించి షెడ్డు నిర్మించడంపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ సదరు ఆక్రమణదారుడు పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. సాగునీటి అవసరాల కోసం కాలువపై చిన్నపాటి కల్వర్టు నిర్మించాలన్నా అనుమతులు వుండాలని చెప్పే ఇరిగేషన్ అధికారులు.. పెదరాంభద్రపురంలో పంట కాలువపై షెడ్డు నిర్మించినా ఎందుకు పట్టించుకోవడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. జలవనరులు, రెవెన్యూ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. కాగా గుంటపల్లి సమీపంలో మంగవరం వచ్చే రోడ్డులో ఓ వ్యక్తి పంట కాలువపై శ్లాబు వేసి షెడ్డు నిర్మించారు. పెద్దిపాలెం సమీపంలో ఆవ కాలువపై ఎటువంటి అనుమతులు లేకుండా మంగవరం గ్రామానికి చెందిన ఒక రైతు కల్వర్టు నిర్మించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడంలేదని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. ఇరిగేషన్‌తోపాటు రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



పెదరాంభద్రపురంలో సాగునీటి కాలువపై నిర్మించిన షెడ్డు

గోకివాడ పాల సేకరణ కేంద్రం వద్ద పాడి రైతుల ఆందోళన



గోకివాడ పాలసేకరణ కేంద్రం కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న పాడి రైతులు

రాంబిల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకివాడ గ్రామంలో విశాఖ డెయిరీ పాలసేకరణ కేంద్రం వద్ద సోమవారం పాడిరైతులు ఆందోళన చేశారు. ఆవు పాలుపై లీటరుకు నాలుగు రూపాయలు తగ్గించడం అన్యాయమని, డెయిరీ విక్రయిస్తున్న చిట్టు, తవుడుపై కూడా ధరలను తగ్గించాలని పాడిరైతులు డిమాండ్ చేశారు. ధర పెంచి పాడి రైతులకు గిట్టుబాటు ధరను అందించాలని డెయిరీ యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు గోకివాడ పాల సంఘం అధ్యక్షుడు నందవరపు నర్సింగరావు, కార్యదర్శి బి.సీతారాంకు పాడిరైతులంతా కలిసి వినతిపత్రంను అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గం లీగల్ సెల్ సభ్యులు పొట్నూరి శివశంకర్, పాడిరైతులు పాల్గొన్నారు.

పాల్తేరు పొలాలను రక్షించండి

- రెవెన్యూ అధికారులకు రైతులు వినతి

పాయకరావుపేట, అక్టోబరు 21 : మండలంలో పాల్తేరు గ్రామంలో కడియం చెరువును ఆనుకుని ఉన్న తమ పంట పొలాలు ముంపుబారిన పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన రైతులు సిద్ధ అయ్యరాజు, అనుసూరి సత్తిబాబు తదితరులు తహసీల్దారు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పాల్తేరులో ఉన్న కడియం చెరువును ఆనుకుని 60 ఎకరాల్లో ఏటా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. కడియం చెరువుకు ఉన్న మూడు కానులు మూసేయడంతో నీరు ఎక్కువగా వచ్చిన సమయంలో తమ భూములు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కడియం చెరువును పరిశీలించి తమ పంట పొలాలు ముంపుబారినపడి నష్టపోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అనుసూరి కొండయ్య, సిద్ధ వీరబాబు, గోనుల రాము, సూరిబాబు, జమీలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న పాల్తేరు రైతులు

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ధర్మవరం అగ్రహారం హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

ఎస్.రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్-17 హాకీ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులను హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు తదితరులు అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ దీపిక మాట్లాడుతూ విశాఖ డీఎల్‌బీ స్టేడియంలో జరిగిన అండర్-17 హాకీ పోటీల్లో తమ విద్యార్థులు టి.వివేక్, కె.మనోజ్, బి.జయశ్రీ, కె.తేజేశ్వరి అద్భుత ప్రతి కనబర్చి త్వరలో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఎంపీడీఓ జయప్రకాష్‌ని కలిసిన జనసేన పార్టీ నాయకులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- అధికారులను కోరిన జనసేన నాయకులు

పాయకరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి మండల అధికారులు కృషిచేయాలని జనసేన పార్టీ నాయకుడు గెడ్డం చైతన్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు పల్లి దుర్గారావు తదితరులు కోరారు. సోమవారం జనసేన పార్టీ నాయకులు ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దారు సత్యనారాయణ, ఎంపీడీఓ జయప్రకాశరావులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారుతో మాట్లాడుతూ మండలంలో భూ రీసర్వే సమస్యలను సత్వరం పరిష్కరించాలని, ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు మంజూరుకు కృషిచేయాలని కోరారు. అదే విధంగా ఎంపీడీఓతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించడంతోపాటు పల్లె పండుగ కార్యక్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు యగదాసు నానాజీ, పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, జగ్గన్నదొర, గీసాల పద్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ప్రారంభించండి

రాంబిల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చూరు గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఎనిమిదేళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన అంగన్‌వాడీ కేంద్ర భవనం పనులు దాదాపు పూర్తి చేశారని, గచ్చులు, తలుపులు ఏర్పాటు చేయలేదని గ్రామస్థులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భవనాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎన్ని వినతులు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదని వారంటున్నారు. ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలావస్థలో ఉంది. దీంతో ప్రభుత్వ పాఠశాల భవనం వరండాలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కూటమి అధికారులు, పాలకులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని పూర్తి చేసి, ప్రారంభించాలని వెల్చూరు గ్రామస్థులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ భవనం ఇదే

పాల్మన్‌పేట సర్పంచ్ సస్పెన్షన్ ఎత్తి వేయలేదు

- ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్

పాయకరావుపేట, అక్టోబరు 21 : మండలంలోని పాల్మన్‌పేట పంచాయతీ సర్పంచ్ కోడ కోటేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తివేతకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు అందలేదని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. ఆయనపై సస్పెన్షన్ ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. గత నెలలో తనను సర్పంచ్ పదవి నుంచి సస్పెండ్ చేస్తూ డీపీఓ ఆర్.శిరీషారాణి ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసినట్టు కోడ కోటేశ్వరరావు ఇటీవల తెలిపిన విషయం తెలిసిందే. దీనిపై ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌ని సోమవారం వివరణ కోరగా.. పాల్మన్‌పేట సర్పంచ్ సస్పెన్షన్ ఎత్తివేతపై ఎటువంటి సమాచారం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందజేదన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్

ఎస్.రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి 24వ తేదీ వరకు తుఫాన్ సంభవించే సూచనలున్నాయని తుఫాన్ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తన కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేసినట్టు తహసీల్దారు జె.రమేష్‌బాబు తెలిపారు. 24 గంటలు అందుబాటులో ఉంటుందని, తుఫాన్ సమయంలో సహాయం, సమాచారం కోసం కంట్రోల్ రూం నంబరు 90323 14938కి ఫోన్ చేయాలని ఆయన కోరారు.

పంచరాత్రుల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

ఎలమంచిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన ఎలమంచిలి పంచరాత్రుల ఉత్సవాల ఏర్పాట్లు భారీ ఎత్తున చేపడుతున్నారు. పట్టణంలోని తులసీనగర్ భూలోక మాంబ అమ్మవారు, పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వర స్వాముల పంచరాత్రుల ఉత్సవాలను ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఇప్పట్నుంచే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలను దీపావళి రోజున ప్రారంభించి నాగుల చవితి రోజు రాత్రి భారీ తీర్థంతో ముగుస్తుంది. తులసీనగర్, పాతవీధి ప్రాంతాల్లోని ఆలయాల వద్ద విద్యుత్ లైటింగ్ అలంకరణను ప్రారంభించారు. ప్రధాన రోడ్డు వెంబడి విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాట్లు ముమ్మరంగా చేశారు.

వారపు సంతలేని పాయకరావుపేట



పాయకరావుపేట పట్టణం

పాయకరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన 24 పంచాయతీలున్న పాయకరావుపేట మండల కేంద్రంలో వారపు సంత లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాయకరావుపేటలో వారపు సంత లేని కారణంగా పట్టణంతోపాటు మండల గ్రామాల్లో ప్రజానీకం తునిలో ప్రతి ఆదివారం జరిగే వారపు సంతపైనే ఆధారపడుతున్నారు. పైగా తుని పట్టణంలోని రైతుబజారు పాయకరావుపేటకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. పాయకరావుపేటలో వారపు సంత లేని కారణంగా పంచాయతీకి రావాల్సిన ఆదాయం లేకపోగా మండల ప్రజలు ఏ వస్తువు కావాలన్నా ఎక్కువగా తుని పట్టణంపైనే ఆధారపడుతన్నారు. పట్టణంలో జనరల్ మార్కెట్ కోసం సుమారు ఆరు ఎకరాల స్థలాన్ని పంచాయతీ కేటాయించి దశాబ్దాలు గడుస్తున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మార్కెట్ స్థలం ఆక్రమణల బారిన పడింది. దీనికితోడు మార్కెట్ అభివృద్ధికి మత్స్యశాఖ ఏర్పాటుచేసిన రిటైల్ చేపల మార్కెట్, రూరల్ హార్ట్ పథకంలో నాబార్డు నిధులతో నిర్మించిన కూరగాయల మార్కెట్ షెడ్లు పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. దీనికి పాలకవర్గాలు, అధికారులు చొరవ చూపకపోవడమే ప్రధానకారణం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలో వారపు సంత ఏర్పాటుకు కృషి చేయాలని మండల ప్రజానీకం కోరుతోంది.

హక్కులను హరిస్తున్న కేంద్రం : సీపీఎం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. సోమవారం స్థానిక అల్లూరి పార్కులో జరిగిన సీపీఎం మండల మహాజన సభలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ, అటవీ హక్కుల చట్టం, పౌరహక్కులు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్, ఎల్ఐసీ తదితర సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. నిత్యావసర ధరలు తగ్గించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అంతకుముందు మండల కార్యదర్శిగా టి.రాజుబాబుతోపాటు మరో ఎనిమిది మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కోటేశ్వరరావు, సాపిరెడ్డి నారాయణమూర్తి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి వీఆర్‌పీ అవకతవకలపై ఫిర్యాదు

గొలుగొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం వీఆర్‌పీ పలు అవకతవకలు పాల్పడ్డారని గ్రామానికి చెందిన ఆర్‌పీ.నాయుడుతోపాటు పలువురు స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని పుత్తడిగైరంపేటలో వీఆర్‌పీ గ్రామంలో ఎస్టిమేట్ లేకుండా గత నాలుగేళ్లుగా అభివృద్ధి పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. కూలీలు పనులకు వెళ్లకపోయినా మస్తర్లు వేస్తున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాల్లోని కోళ్ల ఫారాల్లో పనులు చేస్తున్న వ్యక్తులకు పుత్తడిగైరంపేటలో మస్తర్లు వేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలని వారు కోరారు.

రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

గొలుగొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ కళాశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో నిర్వహించిన పోటీల్లో వెయిట్‌లిఫ్టింగ్‌లో హేమ, రాజ్యలక్ష్మి, పవర్‌లిఫ్టింగ్‌లో గాయత్రీదేవి, రాజేశ్వరి, భవియ్య బంగారుపతకాలు సాధించారని, వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సుధ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సుధ, పీడీ సత్యవతి, అధ్యాపకులు అభినందించారు.

హక్కులను హరిస్తున్న కేంద్రం : సీపీఎం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. సోమవారం స్థానిక అల్లూరి పార్కులో జరిగిన సీపీఎం మండల మహాజన సభలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ, అటవీ హక్కులచట్టం, పౌరహక్కులు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్, ఎల్‌ఐసీ తదితర సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. నిత్యావసర ధరలు తగ్గించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అంతకుముందు మండల కార్యదర్శిగా టి.రాజుబాబుతోపాటు మరో ఎనిమిది మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కోటేశ్వరరావు, సాపిరెడ్డి నారాయణమూర్తి నాయకులు పాల్గొన్నారు.

అమరులైన పోలీసుల సేవలు చిరస్మరణీయం

» కృష్ణాదేవిపేట ఎస్‌ఐ.వై.తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అమరులైన పోలీసులు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి చేసిన సేవలు చిరస్మరణీయమని కృష్ణాదేవిపేట ఎస్‌ఐ వై. తారకేశ్వరరావు అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. అంతకుముందు స్టేషన్‌లో అమరవీరులకు ఎస్‌ఐ, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు నూకరాజు, హెచ్‌సీలు రమణ, వాసు, రామారావు, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో.. మండలంలో తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల్లో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్ స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

» ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత


డీఎంకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్

కృష్ణాదేవిపేట. అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం పీటీడీ బస్ స్టేషన్‌లో సమస్యలపై నర్సీపట్నం పీటీడీ డీఎం ధీరజ్‌కు స్థానిక సర్పంచ్ లోచల సుజాత సోమవారం వినతిపత్రం ఫిర్యాదు చేశారు. బస్ స్టేషన్‌లో ఏళ్ల తరబడి గోతులు ఉన్నాయని, వర్షం పడితే బురదమయం అవుతుందని, ప్రయాణికులకు తాగునీరు, కూర్చోడానికి బెంచీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ప్రజలు, ప్రయాణికులతో కలిసి ఆందోళన చేపడతామని సర్పంచ్ సుజాత హెచ్చరించారు.

తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరుకు సీఎం హామీ

» స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు


గొలుగొండపేట సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నాతవరం, అక్టోబరు 21 : తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం గొలుగొండపేట గ్రామంలో రూ.68 లక్షలతో నిర్మించనున్న గొలుగొండపేట-వెదురుపల్లి రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తన పదవి ముగిసేలోపు తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేయాలని కోరినట్టు చెప్పారు. ఇందుకోసం రూ.2,900 కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుమ్మిడిగొండ వద్ద తాండవ నదిలో ఇసుకబండికి రూ.200 చొప్పున వైసీపీ నాయకులు రూ.రెండు కోట్లు వసూలు చేశారని, నేడు నర్సీపట్నంలో వైసీపీ నాయకులు ఉచిత ఇసుక ఇవ్వాలని ర్యాలీలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రవాణ చార్జీలు భరిస్తే తమ ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు నెలల్లో నర్సీపట్నం నియోజకవర్గానికి రూ.40 కోట్లు అభివృద్ధి పనులు మంజూరు చేశామని, ఇందులో రూ.14 కోట్లు ఒక్క నాతవరం మండలానికే మంజూరు చేశానన్నారు. అలాగే తాండవ గేట్లు మరమ్మతులకు 11 లక్షల రూపాయలు మంజూరైనాయ్యని తెలిపారు. మార్కెట్‌యార్డు చైర్మన్ ఎవరికి ఇవ్వాలో.. తాండవ చైర్మన్ ఎవరికి ఇవ్వాలో తనకు తెలుసునన్నారు. కష్టపడిన వారికే ఈ నామినేటెడ్ పదవులు ఇస్తానని, తన దగ్గరకు వచ్చి లాబియింగ్ చేసినా ఫలితం ఉండదన్నారు. అనంతరం అయ్యన్నపాత్రుడు గొలుగొండపేటలో కొబ్బరి మొక్కలు నాటారు. మాజీ సర్పంచ్ స్వర్గీయ మిరపల బాబులు విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కరక సత్యనారాయణ, నందిపల్లి వెంకటరమణ, ఎన్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, పారుపల్లి కొండబాబు, రాజాన వీరసూర్యచంద్ర, యర్రా సూర్యనారాయణ, వెలగల వెంకటరమణ, కొండ్రు మరిడియ్య, బొడ్డు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ గోడల నిర్మాణానికి ఉపాధి నిధులు

నర్సీపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గొలుగొండ, నర్సీపట్నం, మాకరపాలెం మండలాలలోని 29 పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికి రూ.3.82 కోట్లు మంజూరైనట్టు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సోమవారం ఆయన సమగ్ర శిక్ష ఈఈ నర్సింగరావు, డీఈఈ సుబ్బలక్ష్మిలతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకవరపాలెం మండలంలో 9 పాఠశాలలకు రూ.161.82 లక్షలు, గొలుగొండ మండలంలో 17 పాఠశాలలకు రూ.154.98 లక్షలు, నర్సీపట్నం మండలంలో 3 పాఠశాలలకు రూ.65.25 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులు దగ్గరుండి పనులు చూసుకోవాలని సూచించారు.

జగనన్న కాలనీల్లో ఎల్‌పీసీలు

- » 18 మంది వైసీపీ కార్యకర్తలకు మంజూరు చేసిన గత తహసీల్దార్
- » నిర్మాణాలు ప్రారంభించిన కార్యకర్తలు
- » స్పీకర్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదు
- » విచారణకు ఆదేశించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- » హెచ్చరిక బోర్డులు పెట్టిన రెవెన్యూ అధికారులు


రామన్నపాలెం జగనన్న కాలనీలో అక్రమ నిర్మాణాల వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మాకవరపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పులు ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. దీంతో స్థానిక వైసీపీ నాయకులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా రెవెన్యూ అధికారులు మండలంలో చాలా చోట్ల ఎల్‌పీసీలు మంజూరు చేసి, డబ్బులు దండుకున్న వ్యవహారాలు ఇప్పుడు బయటకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని రామన్నపాలెం గ్రామానికి ఆనుకొని 463 సర్వే నంబరు ఏపీఐఐసీకి చెందిన భూమిలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఇందులో రామన్నపాలెం, చినరాచపల్లి, వెంకయ్యపాలెం, రాచపల్లి, ఎరకన్నపాలెం గ్రామాలకు చెందిన 80 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. వీటిలో రామన్నపాలెం, రాచపల్లి గ్రామాలకు చెందిన 18 మంది వైసీపీ కార్యకర్తలకు ఎన్నికల ముందు అప్పటి తహసీల్దార్ పట్టాలకు బదులు ఎల్‌పీసీలు మంజూరు చేశారు. అయితే రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వెంటనే వైసీపీ కార్యకర్తలు పునాదులు కట్టారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్ రామారావు విచారణ జరిపారు. జగనన్న కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎల్‌పీసీలు మంజూరు చేసిన విషయాన్ని గుర్తించారు. దీంతో వైసీపీ నేతలు వేసిన పునాదులపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ స్థలాలు ప్రభుత్వానికి చెందినవని, వాటిలో నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గబ్బాడ ఇసుక ఉచితంగా ఇవ్వాలని వైసీపీ ర్యాలీ



ఇసుక ఉచితంగా ఇవ్వాలని ర్యాలీ చేస్తున్న వైసీపీ నాయకులు

నర్సీపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గబ్బాడ డిపోలోని ఇసుకని గృహనిర్మాణదారులకు ఉచితంగా ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో గబ్బాడ డిపోలో 65 నుంచి 75 వేల టన్నులు ఇసుక నిల్వ పెట్టడం జరిగిందన్నారు. ఈ ఏడాది జూలైలో జేసీ, మైనింగ్ అధికారులు గబ్బాడ డిపోని సందర్శించి ఇసుక సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నారన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇసుకలో ఏదో జరిగిపోయిందని ఆరోపిస్తూ 100 రోజులు ఇసుక సరఫరా చేయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, సీనియర్ నాయకులు రుత్తల ఎర్రాపాత్రుడు, చింతకాయల సన్యాసిపాత్రుడు, డాక్టర్ లక్ష్మికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పట్టణ సీఐగా గోవిందరావు బాధ్యతలు స్వీకరణ



నర్సీపట్నం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పట్టణ సీఐగా జి. గోవిందరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన కాంతికుమార్‌ని జూన్‌లో డీఐజీ వీఆర్‌లో పెట్టారు. ఆ తర్వాత ఆయన్ని అల్లూరి జిల్లాకు కేటాయించారు. నర్సీపట్నం రూరల్ సీఐ హరి పట్టణ సీఐగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయన బదిలీ తర్వాత ప్రస్తుతం రూరల్ సీఐగా ఉన్న రేవతమ్మ ఇన్‌చార్జిగా ఉన్నారు. పట్టణ సీఐగా గంగుల గోవిందరావుని నియమిస్తూ డీఐజీ గత నెల 8 తేదీన ఉత్తర్వులు ఇచ్చారు. వాస్తవానికి గొల్లంగి గోవిందరావుకి బదులు గంగుల అని ఇంటి పేరు అచ్చు తప్పు పడడంతో నెల రోజు పైగా సస్పెన్స్ నడిచింది. దీంతో ఇన్‌చార్జితో సీఐతో శాంతి భద్రతలు పర్యవేక్షణ కొనసాగించాల్సి వచ్చింది. శనివారం ఇంటి పేరు సరిదిద్ది ఉత్తర్వులు ఇవ్వడంతో గొల్లంగి గోవిందరావుకి లైన్ క్లియర్ అయింది. మూడు నెలల తర్వాత పట్టణ సీఐ పోస్టు భర్తీ జరిగింది.

నేడు గుమ్మిడిగొండలో నల్లగొండమ్మ జాతర

నాతవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుమ్మిడిగొండ గ్రామ ఆరాధ్య దైవం నల్లగొండమ్మ జాతరను మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామం నుంచి అమ్మవారి ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. అలాగే అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేశారు. జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ఉత్సవ కమిటి చైర్మన్ సుర్ల వెంకటరమణ తెలిపారు.

ఎంపీడీవోగా మేరీరోజి


ఎంపీడీవోగా మేరీరోజిని అభినందిస్తున్న మండల కార్యదర్శులు

గొలుగొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా మేరీరోజి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డేవిడ్‌రాజ్ అల్లూరి జిల్లా పాడేరుకు బదిలీపై వెళ్లారు. కొయ్యూరు మండలం నుంచి మేరీరోజి గొలుగొండకు బదిలీపై వచ్చారు. దీంతో సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో మేరీరోజిని గ్రామ కార్యదర్శులు ఎల్.నాగేంద్ర కుమార్, కె. రాజేష్, కె.మనోజ్, జె.రమణమ్మ, గౌరి, కిర్మయి, జగదీశ్వరి అభినందించారు.


పోలీసు అమరుల త్యాగనిరతి గొప్పది: సీఐ



విజేతలకు బహుమతులందిస్తున్న సీఐ అప్పలరాజు

చోడవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టి అమరులైన పోలీస్ అమరవీరుల త్యాగనిరతిని యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక సీఐ పి. అప్పలరాజు తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్నపాలెం గ్రామానికి చెందిన రాజు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధి బి. అప్పలరాజు సహకారంతో పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవానికి సంబంధించి క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో ఉషోదయ కాలేజీ విద్యార్థిని వి.సంకీర్తన, నిత్యసంతోషి, సింధుశ్రీ వరుసగా మొదటి, రెండు, మూడు బహుమతులు గెలుపొందారు. క్విజ్‌లో మొదటి బహుమతి. ఉషోదయ విద్యార్థిని నిత్యసంతోషి, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఎస్. రామకృష్ణ, నాగదుర్గ భవానీ ద్వితీయ బహుమతి, ఉషోదయ కాలేజీ విద్యార్థిని వి. నిత్యసంతోషి తృతీయ బహుమతులు సాధించారు. ఉత్తమ సూచన అవార్డు స్థానిక శ్రీ విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థిని జి. భవానీకి లభించింది. విజేతలకు సీఐ, ఎస్ ఐ నాగకార్తీక్ బహుమతులు అందచేశారు.

రావికమతం: మండలంలోని కొత్తకోట పోలీసు స్టేషన్‌లో సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆధ్వర్యంలో అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఒకటో తేదీనే పెన్షన్లు పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ రాజారావు

మాడుగుల, అక్టోబరు 21: ప్రభుత్వ సామాజిక పింఛన్లు ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పంచాయతీ కార్యదర్శులు బదిలీలు జరిగిందని, ఈ నేపథ్యంలో నవంబరు 1వ తేదీన ప్రతీ ఒక్కరికీ పెన్షన్ అందేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో కొంకి అప్పారావు మాట్లాడుతూ, మండలంలో బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శుల స్థానంలో వచ్చిన నూతన కార్యదర్శులు ఈ నెల 25వ తేదీ నాటికి బ్యాంక్ ఖాతాలను పెన్షన్ పెండింగ్ నగదు, ఖాతాను తమ పేర్లపై బదిలీ చేసుకోవాని ఆదేశించారు. సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకొనేలా గ్రామాల్లో దండోరా తో ప్రచారం చేయాలని కోరారు.

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి

» మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


చౌడువాడ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి సాధించనున్నట్టు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. గ్రామ స్వరాజ్య స్థాపన లక్ష్యంగా పంచాయతీరాజ్‌శాఖ మం త్రి పవన్‌కల్యాణ్ ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి నిధులు విడుదల చేశారని అన్నారు. పల్లె పండుగలో భాగంగా పైడంపేట, మేడిచర్ల, ఆర్‌వీ అగ్రహారం, ఎ.కోడూరు, చౌడువాడ, కొండుపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెజ్ ఏర్పాటు చేసి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయిన వెంటనే ఈ ప్రాంత రైతులకు రైవాడ జలాలను అంకితం చేస్తామన్నారు. మండలంలో మౌలిక వసతులపై స్థానిక నాయకులు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన కోరారు. గ్రామాల్లో శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి, గొండుపాలెంలో గ్రంథాలయాన్నిప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, ఉమ్మడి జిల్లాల సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు, రొంగలి రాఘవనాయుడు, పూడి నారాయణమూర్తి, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, కుంచ అంజిబాబు, బండారు లక్ష్మణరావు, వంటాకు శ్రీను, కన్నూరు సూర్యనారాయణ, బండారు నరసింహనాయుడు, కన్నూరు నాగభూషణం, ఉప తహసీల్దార్ రమేశ్‌బాబు, ఏఓ అప్పలరాజు, ఎంఈఓ డీవీడీ ప్రసాద్, అగ్రికల్చర్ ఆఫీసర్ సోమశేఖర్, సెక్రటరీ సతీష్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయిని నాగజ్యోతి

రోలుగుంట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రోలుగుంట జడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ పోటీలకు ఈ పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు హాజరుకాగా, నలుగురు పతకాలు సాధించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో బి.స్నేహకు రజత పతకం, పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం లభించింది. అలాగే, 61 కేజీల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్‌లో వి.రామ్‌చరణ్‌కు రజితం, 49 కేజీల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్‌లో సింహాద్రి రజితం, అరుణ్ కాంస్య పతకం సాధించారు. విద్యార్థులు ఈ పతకాలు సాధించడంపై హెచ్‌ఎం ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

ఉరకగెడ్డ పునరావాస బాధితులకు ఆర్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి

» సీపీఎం నాయకులు డిమాండ్


ఉరకగెడ్డ ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మాడుగుల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉరకగెడ్డ నిర్మాణం జరిగిన సమయంలో నష్టపోయిన గిరిజనులకు ఆర్‌ఆర్ ప్యాకేజీని వెంటనే ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో ఉరకగెడ్డ, బొడ్డరేవు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉరకగెడ్డ రిజర్వేయర్ నిర్మాణం పనులు జరిగిన సమయంలో చిన బొడ్డరేవు గ్రామానికి చెందిన 56 గిరిజన కుటుంబాలకు ఇళ్ల ప్రాజెక్టులో ముంపునకు గురయ్యాయన్నారు . నేటి వరకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా గిరిజనులకు అన్యాయం చేసిందని అన్నారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి ఇంటి స్థలంతో పాటు అన్ని రాయితీలు కలుపుకొని ఆర్‌ఆర్ ప్యాకేజీ ప్రకారం మొత్తం కుటుంబాలకు 5కోట్ల వరకు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేటి వరకు వారివైపు తొంగి చూడలేదని దుయ్యబట్టారు. వీరికి తగిన న్యాయం చేయకుంటే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఇరట నర్సింహమూర్తి, సీపీఎం నాయకురాలు కార్లి భవాని, గిరిజనులు ముచ్చల జాని, బుసరి మల్లు దొర, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పలు క్రీడా పోటీలకు వడ్డాది కేజీబీవీ విద్యార్థినుల ఎంపిక


రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థినులు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 21: వడ్డాది కెజీబీవీకి చెందిన పలువురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రత్యేకాధికారిణి కె.అన్నపూర్ణ తెలిపారు. అండర్-19 లో బాస్కెట్ బాల్ కె.బాంధవ్య, నెట్‌బాల్ పోటీలకు ఎ. వెంకటపద్మ, వి.జ్ఞానేశ్వరి, ఎం.శ్యామల, అండర్19 హాండ్ బాల్ పోటీలకు కె.కార్తిక, ఎస్.యమున, పి.తిరుమల, జి.వాణి, అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు ఎస్.పూజ, ఎ.దీపిక, వి.ఊర్మిళ, ఎస్.హాసిని ఎంపికైనట్టు చెప్పారు. అండర్-19 టెన్నికాయిట్ పోటీలకు నిశ్వక, అండర్17 హాండ్ బాల్ పోటీలకు హేమ, అండర్-14 విభాగం బాలికల పోటీలకు ఎస్.దివ్య, జె.లావణ్య మొత్తం వివిధ పోటీలకు 16 మంది విద్యార్థినులు ఎంపికైనట్టు చెప్పారు. ఈ విద్యార్థినులను ప్రత్యేకాధికారితోపాటు పీడీ ప్రవళిక, ఎస్ఎంసీ చైర్మన్ వై.సత్యవేణి అభినందించారు.

జోనల్ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక


ఐటీ ఒకేషనల్ నమూనాతో విద్యార్థులు

దేవరాపల్లి: జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో తెనుగుపూడి గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.రాము తెలిపారు. ఈనెల 18న కొక్కిరాపల్లిలో జరిగిన సైన్స్ ఫెయిర్ పదవ తరగతి చదువుతున్న రామ్ చరణ్, భవానీ ప్రసాదు ఐటీ ఒకేషనల్ విభాగంలో స్పెషల్ అచీవ్‌మెంటు అవార్డు పొందారు. భూమి ఉపరితల వాతావరణంలో తక్కువ రేడియేషన్ ద్వారా మానవులకు, జంతువులకు, పక్షులకు జీవిత కాలం పెంపొందించవచ్చు అనే కాన్సెప్ట్‌తో స్పెషల్ అచీవ్‌మెంటు అవార్డు సొంతం చేసుకున్నారు. వీరికి జోనల్ స్థాయికి పాల్గొంటారన్నారు. తర్ఫీదు ఇచ్చిన లక్ష్మణరావును అభినందించారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుపై ఫిర్యాదు

చోడవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడలో జనావాసాల మధ్య ఏర్పాటుచేసిన మద్యం దుకాణం తొలగించాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జనావాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాలతో మహిళలు, పిల్లలు ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని వేరేచోటకు తరలించాలని విజ్ఞప్తి చేశారు.

తుఫాన్ పట్ల అప్రమత్తం

దేవరాపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) బంగాళాఖాతంలో ఈనెల 22 నుంచి తలెత్తనున్న తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లక్ష్మీదేవి కోరారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రైవాడ జలాశయం దిగువనున్న గ్రామాలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. జలాశయంలోకి వరద నీరు చేరినట్లయితే, శారదా నదిలోకి విడుదల చేస్తామన్నారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన వారు 7032521509 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు. గ్రామాల్లో దండోరా ద్వారా అప్రమత్తం చేయాలని ఆదేశించామన్నారు.

నవగ్రహ గుడికి శంకుస్థాపన


దిబ్బిడిలో శంకుస్థాపన చేస్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 21: దిబ్బిడి మాణిక్యాంబ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నవ గ్రహ గుడి నిర్మాణానికి అర్చకుడు డి.సన్యాసిరావు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గొంపా వెంకటేశ్వరరావు, సర్పంచ్ పి.మాణిక్యం, ఉప సర్పంచ్ ఎ. రామారావు, కెపీ. అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 21: గుంటూరులో సోమవారం ప్రారంభమైన ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ రీజనల్ లెవెల్ వర్క్‌షాపులో పాల్గొన్న ఏపీ గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబును రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ పి.రాజబాబు సత్కరించారు. ఈ వర్క్ షాప్‌లో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారధి పాల్గొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకాల అమలుపై చర్చించారు.

జాతీయస్థాయి పోటీలకు డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్

అరకులోయ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఈనెల 25, 26 తేదీల్లో జరిగే 39వ జాతీయస్థాయి జూనియర్ ఆథ్లెటిక్స్ పోటీలకు అరకు డిగ్రీ కళాశాల విద్యార్థులుఎంపికైనట్టుప్రిన్సిపాల్ భరత్‌కుమార్ తెలిపారు. ఇటీవల గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ ఆథ్లెటిక్స్ పోటీలలో కళాశాలలోని బీఎస్సీ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.లోహిత్ 200, 400 మీటర్లలో గోల్డ్ మెడల్ సాధించగా, ప్రథమ సంవత్సరం విద్యార్థి పవన్‌కుమార్ వంద మీటర్లలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. వీరితోపాటుగా గోపాలకృష్ణ లాంగ్‌జంప్‌లో స్వర్ణపతకం సాధించినట్టు తెలిపారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. ఈ కార్యక్రమంలోని ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మి, అనితకుమారి, పీడీ సమర్థి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సర్దుబాటు


మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పాలనపరంగా ఇబ్బందులు తలెత్తకుండా కార్యదర్శులను సర్దుబాటు చేస్తున్నట్టు ఎంపీడీవో ఏవీవీ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన బదిలీలలో మండలానికి వచ్చిన ఏడుగురు గ్రేడ్ -4 కార్యదర్శులు బాధ్యతలు స్వీకరించారన్నారు. ప్రస్తుతం ఉన్న ఇద్దరు గ్రేడ్- 4 కార్యదర్శులతో కలిపి 9 మందికి 24 పంచాయతీల్లో సర్దుబాటు చేయనున్నామన్నారు. ప్రజలకు అందుబాటులో సేవలను అందిస్తూ. పంచాయతీ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు.

పీవీటీజీ గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకుడు పాలిక లక్కు

పాడేరురూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో పీవీటీజీ గ్రామాల్లో బడి ఈడుగల 10 మంది పిల్లలు ఉన్నచోట్ల పాఠశాలను ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం నాయకుడు పాలికి ల క్కు కోరారు. మండలంలోని వంట్లమామిడి పంచాంచాయతీ జోడూరు పీవీటీజీ గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు గిరిజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో గత ఆగస్టు నెలలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కలెక్టర్ ఆదేశాలపై డీఈవో జోడూరు లో 28 పిల్లలతో సోమవారం పాఠశాల ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. సందర్భంగా ఆయన చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ చిన్నారినీ ప్రతీ రోజు పాఠశాలకు పం పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి.భాస్కరరావు, కె.కామేష్, వి.కోమటి రావు, కామేశ్వరరావు, సోమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ సేవలు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పంచాయతీల్లో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ సేవలు అందుబాటులోకి రానున్నాయని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. ధారకొండ, జీకేవీధి-1, రింతాడ-1, మొండిగెడ్డ, లక్కవరపుపేట ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ప్రజలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 26 వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలి


బురదమయమైన రహదారిని చూపుతున్న పాండురాజు

జి. మాడుగుల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాడేరు కేంద్రంగా నిర్మాణం నిర్మిస్తున్న జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని స్థానికుడు, కరాటే జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకురి పాండు రాజు కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. చింతపల్లి మండలం తాజంగి నుంచి పాడేరు మండలం డి.గొందురు వరకు మట్టి పనులు జరుగుతున్న క్రమంలో ప్రస్తుత వర్షాలకు రహదారి బురదమయంగా మారిందన్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నారని చెప్పారు. అధికారులు చొరవ చూపి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.


పాడేరు ఘాట్‌లో మలుపు వద్ద ఛిద్రమైన రహదారి


ఘాట్‌లో భారీ వాహనాలు

ప్రమాదం అంచున ప్రయాణం

» కేబుల్ లైన్ కోసం తవ్వకాలు.. పూడ్చకుండా వదిలేసిన గోతులు » ఇరుక్కుపోతున్న వాహనాలు

ఘాట్ రోడ్డే ప్రమాదభరితం.. ఇరుగ్గా మెలికలు తిరుగుతూ జారుడుబల్లలాంటి మార్గంలో ఒకవైపు లోయలు.. మరోవైపు మింగేసేలా ఉన్న ఎత్తైన పర్వత శ్రేణులతో ప్రయాణికులకు భయం గొల్పుతుంది. అలాంటి మార్గంలో ఇటీవల కేబుల్‌లైన్ కోసం తవ్వకాలు చేపట్టి వదిలేశారు. ఎక్కడికక్కడ మట్టి కుప్పలు, గోతులతో వాహనదారులు హడలిపోతున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించే ప్రయత్నంలో ఒక్కోసారి ఇరుక్కుని ట్రాఫిక్ సమస్యలుత లెత్తుతున్నాయి. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి కేబుల్ లైన్‌కోసం తవ్విన గోతులను పూడ్చాల్సిన అవసరం ఉంది.

పాడేరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన పాడేరు ఘాట్ మార్గం ప్రమాద భరితంగా మారింది. ఈ రహదారిలో బీఎస్ఎన్ఎల్ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లైన్‌లు వేసేందుకు తవ్వకాలు చేపట్టిన కాంట్రాక్టర్ తిరిగి వాటిని సక్రమంగా పూడ్చలేదు. దీంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పించుకోవడానికి వాహనదారులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వాహనాలు ఘాట్ ఎక్కే సమయంలో ఎదురుగా వచ్చే కార్లు, జీపులతో పాటు ద్విచక్రవాహనదారులు సైతం తప్పించుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. జిల్లా వ్యాప్తంగా పర్యాటకుల సందడి ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టి ప్రయాణీకులు, ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, పర్యాటకులు కోరుతున్నారు.

తవ్వేశారు.. వదిలేశారు...

» బొర్రా గుహలకు వెళ్లే మార్గంలో దుస్థితి

» పర్యాటకులకు అవస్థలు

అనంతగిరి, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలను వెళ్లేరోడ్డును ఆనుకుని, ఓహెచ్‌సీ కేబులు వేసేందుకు గోతులను తవ్వి సక్రమంగా పూడ్చకపోవడంతో ప్రయాణాలకు వాహనదారులు హడలిపోతున్నారు. అసలే రోడ్డు విస్తారంగా లేకపోవడం ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించేపరిస్థితి అంతంతమాత్రం ఉంటోంది. దీంతో ఒక్కోసారి అదుపుతప్పి గోతుల్లో పడాల్సి వస్తోందని పర్యాటకులు భయాందోళన చెందుతున్నారు. పర్యాటక సీజన్ కావడంతో బొర్రా అందాలను తిలకించేందుకు ప్రైవేటు వాహనాలు, బస్సుల ద్వారా అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని మట్టిదిబ్బలు, గోతులు ప్రత్యక్షమవుతుండడంతో వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి, గోతులను పూడ్చివేత చర్యలు చేపట్టాలని, వాహనదారులు, పర్యాటకులు కోరుతున్నారు.


బొర్రా గేటువలస సమీపంలో మట్టిదిబ్బలు..


రైల్వే గేటు సమీపంలో మలుపు వద ప్రమాదకరంగా గోతులు

సాంకేతికపరమైన విజ్ఞానాన్ని బోధించాలి: ఆర్‌జేడీ


వలంటీర్లకు సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పాడేరురూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులకు సాంకేతిక పరమైన విజ్ఞానాన్ని అందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని కళాశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్.ఎస్.శోభారాణి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలను సందర్శించారు. వచ్చే నెల 7, 8వ తేదీలలో నేక్ బృందం కళాశాలను పర్యవేక్షించనున్న నేపథ్యంలో కళాశాలలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. కళాశాల్లో ఆర్ట్స్, సైన్స్ విభాగాలను, లైబ్రరీ, కంప్యూటర్ విభాగాలను సందర్శించి పలుసూచనలు చేశారు. జెడ్ స్పేస్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ అధ్యాపకులు, సిబ్బంది సత్కరించి మోదకొండమ్మ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టిబ్బాయి పాల్గొన్నారు.

వార్డు వలంటీర్ల బకాయి వేతనాలు చెల్లించాలి

» సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు


వలంటీర్లకు సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పాడేరురూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహించిన వలంటీర్లకు బకాయి వేతనాల చెల్లించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 10 వేతనం చెల్లిస్తూ వారిని విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో వలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అధ్యతన నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడారు. బలవంతంగా రాజీనామాలను చేయించిన వలంటీర్లను కొనసాగించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్, కార్యదర్శి ఎల్.సుందరరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మానపడాల్, వాలంటీర్ల యూనియన్ నాయకులు కొండబాబు, శోభన్, ప్రసన్నకుమార్, దేవా, తాతబాబు, చిన్నయ్య, సురేష్, విజయ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

ముంచంగిపుట్టు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో మండలంలోని జర్జుల పంచాయతీ సంతవీధి గ్రామానికి చెందిన ఐదుగురిని అరెస్టు చేసి సోమవారం కోర్టుకు తరలించినట్టు జి.మాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకటరావు తెలిపారు. మండలంలోని జర్జుల పంచాయతీ సంతవీధి గ్రామానికి చెందిన వి.బాబూరావుపై ఈ నెల 17వ తేదీన అదే గ్రామానికి చెందిన కె.రాధాకృష్ణ క్రికెట్ బ్యాట్‌తో బలంగా కొట్టడంతో పాటు పలువురు అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పాత కక్షల నేపథ్యంలో ఈ దాడికి జరిగింది. గాయపడిన బాబూరావు పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం 19వ తేదీన మృతి చెందాడు. మృతుని భార్య చీమలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈకేసులో నిందితులు కె.నరేంద్ర, కె.నరసింహమూర్తి, కె.సొన్ను, కె.నారాయణ మూర్తిలను అరెస్టు చేసినట్టు సీఐ వివరించారు.

సచివాలయాలను ప్రక్షాళన చేయాలి

» గిరిజన ప్రాంత సర్పంచులు డిమాండ్



కలెక్టరేట్‌లో అల్లూరి విగ్రహం వద్ద సర్పంచ్‌ల నిరసన పదర్శన

పాడేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, ఆ సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలని గిరిజన ప్రాంత సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొర్రా నాగరాజు ఆధ్వర్యంలో ఈమేరకు కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌కు సోమవారం వినతిప త్రం అందించారు. అనంతరం బొర్రానాగరాజు, పలువురు గిరిజన సర్పంచ్‌లు విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి గ్రామాలు అభివృద్ధి కాకుండా కుట్ర చేసిందని ఆరోపించారు. సచివాలయంలో 11 మంది సిబ్బందిని నియమించినా, వారిపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో పాలన గందరగోళంగా మారిందన్నారు. ఫలితంగా ప్రజలకు సరైన రీతిలో సేవలు అందకపోవడంతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థ బలహీనపోయిందన్నారు. పంచాయతీల బలోపేతానికి చర్యలు చేపడుతున్న ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సచివాలయాలను ప్రక్షాళన చేయాలన్నారు. ఈ మేరకు కలెక్టర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పాంగి పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణరాజు, కొట్టగుల్లి ఉషారాణి, శశిభూషణ్‌నాయుడు,టి.సత్యనారాయణ,పి.రంజిత్‌కుమార్,ఎం.శాంతికుమారి ఉన్నారు.

వైద్యుల ఖాళీల భర్తీకి చర్యలు: డీసీహెచ్‌ఎస్


ఆస్ప త్రిలో ఉద్యోగులను విచారిస్తున్న డీసీహెచ్‌ఎస్ కృష్ణారావు

చింతపల్లి, అక్టోబరు 21, ఆంధ్రజ్యోతి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్టు పాడేరు డీసీహెచ్‌ఎస్ కె. కృష్ణారావు తెలిపారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన సందర్శించారు. విధులకు గైర్హాజరవుతున్న స్థానిక జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సూపరింటెండెంట్‌ని మెడికల్ సూపరింటెండెంట్ సరెండర్ చేయడంతో డీసీహెచ్‌ఎస్ విచారణ చేపట్టారు. అనంతరం డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ, ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణుల ఖాళీలను భర్తీకి జిల్లా కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. త్వరలోనే ఈ ఖాళీలు భర్తీ కానున్నాయన్నారు. అలాగే ఏరియా ఆస్పత్రి జూనియర్ అసిస్టెంట్ టీవీ వాణి లక్ష్మి మెడికల్ సూపరింటెండెంట్ ఆదేశాలను పాటించపోడం, ఆఫీస్ సూపరింటెండెంట్ టి. రాజారావు విధులకు గైర్హాజరుకావడంతో సూపరింటెండెంట్ ఈ ఇద్దరినీ డైరెక్టరేట్ ఆఫ్ సెంకడరీ హెల్త్‌కి సరెండర్ చేశారన్నారు. వీరిపై విచారణ చేపట్టామన్నారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్ దరఖాస్తుల గడువు పెంపు

పాడేరురూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ తెగల అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తూ మూడు నెలలపాటు అందించే శిక్షణకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికరత అధికారి జి.జనార్దనరావు తెలిపారు. డీఎస్సీ శిక్షణ సంస్థలకు వివరాలతో కూడిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్టు (ఈవోఐ) (ఈవోఐ డాక్‌మెంట్ నెంబర్ 757795)ను ఏపీ ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్టు చెప్పారు. ఆ సక్తి ఉన్న శిక్షణ సంస్థల ఇతర వివరాల కోసం డ్యాక్‌మెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

సీలేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసువులబాసిన పోలీసుల త్యాగాలు మరువలేమని స్థానిక ఎస్సై రామకృష్ణ అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకుని పోలీసులు పంచాయతీ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద మానవహారం చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మావోయిస్టు దాడిలో బలిమెల రిజర్వాయర్‌లో 38మంది పోలీసులు మరణించారన్నారు. విధుల్లో మృతిచెందిన పోలీసుల సేవలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.


గూడెంకొత్తవీధిలో ర్యాలీ చేస్తున్న పోలీసులు


సీలేరులో మానవహారం చేస్తున్న పోలీసులు

గూడెంకొత్తవీధిలో..

గూడెంకొత్తవీధి: పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని స్థానిక ఎస్సై అప్పలసూరి అన్నారు. సోమవారం అమరవీరుల సంస్మరణ వారోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. బస్ స్టాండ్ వద్ద మానవహారం చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విధుల్లో ఉంటూ ప్రాణాలు కోల్పోయిన పోలీసుల సేవలు ఎన్నడూ మర్చిపోలేమన్నారు. అమరుల ఆశయసాధనకు ప్రతి ఒకరు కృషి చేయాలన్నారు. అమరుల కుటుంబాలకు దేవుడు ఓదార్పు ఇవ్వాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.


ఉత్సవాల ముహూర్తపురాట కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు ముహూర్తపు రాట

పాడేరురూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గౌరీపరమేశ్వరుల మహోత్సవాలకు సోమవారం మోదకొండమ్మ ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం పంతులు వేదమంత్రాల మధ్య ముహూర్తపు రాటను గౌరీ సేవా సంఘం ప్రతినిధులు ప్రతిష్ఠించారు. గత 12 ఏళ్లగా పాడేరులో ఏటా కార్తీకమాసంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోం ది. అందులో భాగంగానే ఈ ఏడాది అ క్టోబరు 30వ తేదీ నుంచి నవంబరు 30వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. నెల రోజులపాటు ఆలయం వద్ద వివిధ రకాల కార్యక్రమాలను, పూజలను నిర్వహించనున్నామన్నారు. ఈ ఉత్సవాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కొణతాల సతీష్, ఎల్లపు మోహన్, తనకాల సూరిబాబు, కొణతాల ప్రశాంత్, మల్ల పరమేశ్వరరావు, సరసా మధు, భీశెట్టి సాయిరాం, మద్దాల కొండబాబు, దాడి శ్రీను, కనిశెట్టి నాయుడు, చదరం ఈశ్వరరావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

'ఇసుక సేకరణకు అడ్డుతగులుతున్న అటవీశాఖ అధికారులు'


టీడీపీ పాడేరు ఇన్‌చార్జి ఈశ్వరికి వినతి పత్రం అందజేస్తున్న సునీల్, గిరిజనులు

చింతపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతుగెడ్డ పరిసర ప్రాంతాల్లో ఇసుక సేకరి ంచి పక్కా గృహాలు నిర్మించుకుంటున్న ఆదివాసీలను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం తగదని టీడీపీ నాయకుడు, సర్పంచ్ చింతర్ల సునీల్ అన్నారు. సోమవారం టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి టీడీపీ నాయకులు, ఆదివాసీలు అటవీ శాఖ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చింతపల్లి మండలంలో పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా 950 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఆదివాసీలు వాగుల్లో లభించే ఇసుకను సేకరించి పక్కా గృహాలను నిర్మించుకుంటున్నారన్నారు. వీరిపై అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతోపాటూ రూ.వేలల్లో జరిమానా విధిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితమని ప్రకటించినా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం బాధాకరమన్నారు. ఈసందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ ఇసుక సేకరణపై అటవీశాఖ ఆంక్షలను తొలగించాలని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతానని ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పాంగి బాబూరావు పాల్గొన్నారు.

ఆకు కూరలతో ఆరోగ్యం


టీడీపీ పాడేరు ఇన్‌చార్జి ఈశ్వరికి వినతి పత్రం అందజేస్తున్న సునీల్, గిరిజనులు

కొయ్యూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెరట్లో లభ్యమయ్యే మునగాకు, కరివేపాకు ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తాయని ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి అన్నారు. సోమవారం ప్రాజెక్టు పరిధి చింతలపూడి సెక్టారులో సీబీ ఈవెంట్ కమ్యూనిటీ చెస్టు ఈవెంట్ కింద నిర్వహించిన ప్రత్యేక కార్యక్ర మంలో సీడీపీవో మట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉండే పోషక విలువలు గల మునగాకు, కరివేపాకుతో కలిగే లాభాలను వివరించారు. అనంతరం ఈ ఆకులతో చేసిన పిండి వంటలను, పొడులను చేయటం చూపించి ప్రదర్శించారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టారుపరిధి అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు కొండమ్మ, సునీత, మహాలక్ష్మి, బాలమణితోపాటు డీఈవో, బీపీసీ, ఎంఎస్‌కేలు హాజరయ్యారు.

రామాలయ ప్రారంభోత్సవం


గొప్పులపాలెంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న గ్రామస్థులు

జి.మాడుగుల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంజరి పంచాయతీ గొప్పులపాలెంలో రామాలయం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించినట్టు విశ్వహిందు పరిషత్ జిల్లా ధర్మ ప్రచార కార్యకర్త రీమలి అప్పలరాజు తెలిపారు. తిరుమల దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు నిధులు, దేవదాయ శాఖ సహకారంతో ఈ ఆలయం నిర్మించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వెంకటరమణ, కృష్ణ, భీమన్న, చైతన్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పక్కాగా అమలు చేయాలి: ఎంఈవో

ముంచంగిపుట్టు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ పక్కాగా అమలు చేయాలని ఎంఈవో క్రిష్ణమూర్తి ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని పలు జీయూపీఎస్ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు లెక్కలను బోధిం చారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు తప్పని సరిగా నమోదు చేయాలని, బడిఈడు పిల్లలు విధిగా పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఉపాధ్యాయులకు ఎంఈవో సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణ శోభితం


కరిముఖిపుట్టు సమీపంలో బంగారు వర్ణంలో ఆకాశం

ముంచంగిపుట్టు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిముఖిపుట్టు సమీపంలో సోమవారం నీలి మేఘాలు స్వర్ణకాంతులతో మెరిశాయి. సూర్యాస్తమయ సమయంలో బంగారు కాంతులు వెదజల్లుతూ మేఘాలు ఆకట్టుకున్నాయి. వీటిని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

ఉదయం ఎండ.. సాయంత్రం వర్షం

పెదబయలు: మండల కేంద్రం లో సోమవారం తెల్లావారు జామున దట్టమైన పొగమంచు కురిసింది. ఉదయం 9 గంటల వరకు ఈ తెరలు వీడలేదు. వాహనాలు హెడ్‌లైట్ వెలుగులో ప్రయాణాలు సాగించారు. ఉదయం 10 తర్వాత భానుడు ప్రతాపాన్ని చూపాడు. ఎండ, ఉక్కపోతకు ప్రజలు ఇబ్బదులు పడ్డారు. మధ్యాహ్నం రెండు గంటల అనంతరం చిరు జల్లులతో మొదలై సాయంత్రం ఆరు గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వారపు సంతకు వచ్చిన వర్తకులు, గిరిజనులు అవస్థలు ఎదుర్కొన్నారు.

ఎంపీపీ వచ్చినప్పుడే ఆ భవనాలు తెరుచుకుంటాయా..?

» ఇలా అయితే పనులపై వచ్చే సర్పంచులు, ఎంపీటీసీలు ఎక్కడ ఉండాలి » మండలాధ్యక్షుడిపై సభ్యులు ప్రశ్నల వర్షం » వాడీవేడిగా అనకాపల్లి మండల సమావేశం





మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యులకు సమాధానం చెపుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

తుమ్మపాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భవనాలను సొంత జాగీరులా వినియోగిస్తూ.., నచ్చినప్పుడు తాళాలు తీస్తూ.. మిగిలిన వేళల్లో తాళాలు వేసుకుని వెళ్లిపోతే ఎలా..? అని పలువురు ఎంపీటీసీ సభ్యులు అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబును ప్రశ్నించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం అనకాపల్లి మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా పలువురు ఎంపీపీ సూరిబాబుపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రధానంగా గొలగాం ఎంపీటీసీ నారపిన్ని చంద్రశేఖర్ మాట్లాడుతూ కేవలం ఎంపీపీ సూరిబాబు ఎంపీడీవో కార్యాలయానికి వస్తున్న సందర్భంలో మాత్రమే కొన్ని ప్రభుత్వ భవనాలు తెరుచుకోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ భవనాలను సొంత భవనాలుగా వాడుకోవడం ఏమిటన్నారు. ఇలా జరుగుతుండడం వల్ల వివిధ పనులపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కార్యాలయానికి వచ్చినప్పుడు తాళాలు వేసి ఉంటుండడంతో కనీసం నిలువ నీడలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, బవులవాడ ఎంపీటీసీ తోటాడ విజయ్ తదితరులు ఇదే అంశంపై గళమెత్తారు. ఎంపీపీ చాంబరుకు మాత్రమే తాళాలు వేసుకుని, మిగిలిన ప్రాంగణాన్ని ప్రతీ రోజూ తెరిచి ఉంచాలని కోరారు. దీని వల్ల ఆయా పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజాప్రతినిధులకు సేదదీరే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం వేదికపై ఉన్న ఫ్లెక్సీపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఫొటో లేకపోవడంతో పలువురు సభ్యులు అభ్యంతరం తెలిపారు. తక్షణమే ఎమ్మెల్యేకు గౌరవాన్ని కల్పిస్తూ ప్రస్తుత నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పలు శాఖల అధికారులు తమ పరిధిలో జరిగే అభివృద్ధి పనులను వివరించగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పనులపై మండిపడ్డారు. బవులవాడ పంచాయతీ పరిధిలో వైద్య సిబ్బంది కొరతతో రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదని ఎంపీటీసీ తోటాడ విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని పలు సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. తుమ్మపాల ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు మాట్లాడుతూ జల్ జీవన్‌మిషన్ ద్వారా తుమ్మపాలలో ఇంటింటా కుళా యిల ఏర్పాటు అస్తవ్యస్తంగా మారిందన్నారు. సరైన మ్యాపింగ్ చేయకుండా పనులు చేపట్టడంతో పలువురు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలపట్ల విద్యుత్ సిబ్బందిపై మండిపడ్డారు. ఆర్ఈసీఎస్ ఈపీడీసీఎల్‌లో విలీనమైనప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ఆర్ఈసీఎస్‌ను ఈపీడీసీఎల్‌లో విలీనం లేకుండా చూడాలని కోరారు. అంతకుముందు ఎంపీపీ సూరిబాబు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పంచాయతీల్లో జరుగుతున్న కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు అధి కారులు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఎంపీడీవో నరసింహారావు, తహసీల్దార్ కె.విజయకుమార్, జడ్పీటీసీ సత్యవతి, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, మ డల కో-ఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, ఊడేరు సర్పంచ్ ఎస్.కృష్ణమోహన్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తం

» లోతట్టు ప్రాంతాల ప్రజలకు పలు సూచనలు
» అన్ని యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఈవో ఆదేశం
» విద్యా శాఖ, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు



వెంకటలక్ష్మమ్మ, డీఈవో

కొత్తూరు, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న మూడు రోజుల్లో పెను తుఫాన్ ఒడిశా సరిహద్దులో తీరం దాటే క్రమంలో ఉత్తరాంధ్రలో వర్షాలు పడే సూచన ఉన్నా యని, ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ సోమవారం సూచించారు. పాఠశాలల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో నిర్మాణ పనుల నిమిత్తం తీసిన గోతులపై మూతలు వేయడం, నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, పల్లపు ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడడం వంటివి చేయాలన్నారు. వాడిన కొబ్బరి బొండాలు, టైర్లు తదితర వాటిని పాఠశాలల ఖాళీ ప్రాం తాల్లో లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో బోధన చేయరాదని, పిల్లలు అటువైపు తిరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వివరించారు. మధ్యాహ్న భోజనంలో ఉపయోగించే మంచినీరు కలుషితం లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. తుఫాన్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా విద్యాశాఖ కార్యాలయం, అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన వారు 85008 88128, 91770 42789, 94414 65433, 77806 21162 నంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో...

అనకాపల్లి : 89859 96839
కశింకోట : 81436 31525
పరవాడ : 88970 83878
సబ్బవరం : 94923 53994

అనకాపల్లి టౌన్/కశింకోట/పరవాడ/సబ్బవరం : వాతావరణ శాఖ తాజా హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం నుంచి గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాం తాల్లో నివాసం ఉంటున్న ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం తహసీల్దార్లు కె.విజయ్‌కుమార్, ఎ.శ్రీనివాసరావు, ఎస్వీ అంబేడ్కర్, బి.చిన్నికృష్ణ సూచించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అత్యవసర సమాచారం కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాలని కోరారు. అలాగే, ఉద్యోగులంతా 24 గం టలు అటు గ్రామాల్లో, ఇటు కార్యాలయంలో అందుబాటులో ఉండేలా డ్యూటీలు వేయడం జరిగిందన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు అమరవీరుల చిత్రపటానికి గౌరవ వందనం చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐ ఈశ్వరరావు, జనార్ధన్, శివాజీ, శ్రీను, సత్యవతి, హైమా, సంతోష్, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పది మందికి ట్రైసైకిళ్లు పంపిణీ



ట్రై సైకిళ్లు అందుకున్న దివ్యాంగులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఉడ్‌పేటలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సోమవారం ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమశాఖ జిల్లా సహాయ సంచాలకులు జగదీష్ సహకారంతో పది మంది దివ్యాంగులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో నిస్సహాయులైన దివ్యాంగుల కోసం గత ప్రభుత్వంలో ఇచ్చే పింఛన్ రూ.ఐదువేలు నుంచి రూ. 15వేలకు పెంచారని హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగుల జీవనభృతి కోసం ఎన్టీఆర్ భరోసా కింద రూ. పదిహేను వేలు ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెంట్ వియ్యపు రమేష్, సంఘ కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపాలెంలో జాతీయ క్రీడా దినోత్సవం



వ్యాయామ ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న తోటి ఉపాధ్యాయ బృందం

తుమ్మపాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో క్రీడలు ఒక భాగం కావాలన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చునని సూచించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయిని లంబా గౌరిని సత్కరించి, హాకీ క్రీడా దిగ్గజం ధ్యానచంద్ చిత్రపటాన్ని అందించారు. ఉపాధ్యాయులు గొంది చినబ్బాయి, వసంతరావు, అనిరోజ్, లక్ష్మి, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు పరవాడలో రెవెన్యూ గ్రామ సభ

పరవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామసభ కొనసాగుతుందన్నారు. రైతులందరూ పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. సమస్యలపై అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని వివరించారు.

ఓ పక్క ఎండ.. మరో పక్క జోరు వాన..

» బయ్యవరంలో భిన్నమైన వాతావరణం



కశింకోట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం గ్రామంలో సోమవారం భిన్నమైన వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం ఒకపక్క ఎండ.. మరో పక్క జోరువాన కురవడంతో స్థానికులు నివ్వెరపోయారు. అయితే బయ్యవరం గ్రామం దాటిన తరువాత ఒక్క చినుకు కూడా లేకపోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. సుమారు గంటపాటు ఎండ కాసి, వాన కురిసింది.

డీఐజీని కలిసిన అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా



డీఐజీకి మొక్క అందిస్తున్న అనకాపల్లి ఎస్పీ సిన్హా

విశాఖపట్నం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టిని ఆయన కార్యాలయంలో అనకాపల్లి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తుహిన్‌సిన్హా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీకి మొక్క అందించారు. అనంతరం శాంతి భద్రతలు పలు అంశాలపై చర్చించారు.

పాల సేకరణ ధర తగ్గింపుపై ఆగ్రహం

» ధర పెంచకుంటే పాలు పోయడం నిలిపివేస్తాం » విశాఖ డెయికి పైడివాడ అగ్రహారం రైతులు హెచ్చరిక



పైడివాడ అగ్రహారంలో పాల సొసైటీ ఎదుట నిరసన తెలుపుతున్న పాడి రైతులు

సబ్బవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ పాల సేకరణ ధరను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని పైడివాడ అగ్రహారంలో రైతులు సోమవారం పాల సొసైటీ కార్యాలయం ముందు పాలక్యాన్లతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యయ ప్రయాసలకోర్చి తామంతా పాడిపైనే ఆధారపడి జీవిస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రాసం, దాణా, కూలీ రేట్లు పెరిగిపోవడంతో పశు పోషణ కష్టంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో విశాఖ డెయిరీ పాల సేకరణ ధరను తగ్గించడం అన్యాయమన్నారు. ఇతర డెయిరీలు ఎక్కువ ధరకు పాలను కొనుగోలు చేస్తున్నా విశాఖ డెయిరీపై నమ్మకంతో దశాబ్దాలుగా పాలు పోస్తున్నామన్నారు. ఇలాంటి తమను ఈ రకంగా ఇబ్బందులకు గురిచేయడం విశాఖ డెయిరీ యాజమాన్యానికి తగదని వాపోయారు. పాల సేకరణ ధరను పెంచకుంటే అంతా కలిసి పాలు పోయడాన్ని నిలిపివేస్తామని స్పష్టం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.

వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 'డీపీఎన్' విద్యార్థులకు పతకాలు



పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

కశింకోట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లాల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కశింకోటకు చెందిన డీపీఎన్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు అద్భుత ప్రతిభ చూపినట్టు ప్రధానోపాధ్యాయుడు ఆచంట రవి సోమవారం తెలిపారు. బాలికల అండర్ 17 విభాగంలో తమపాఠశాలకు చెందిన సిహెచ్.వైశాలి రెండు క్రీడాంశాల్లో స్వర్ణ పతకాలు సాధించినట్టు చెప్పారు. బాలుర విభాగంలో ఎన్.ముఖేష్, వై.డాన్ ప్రసాద్ వెయిట్ అండ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకాలు సాధించాదరాన్నరు. దీంతో స్వర్ణ పతకాలు సాధించిన వైశాలి వచ్చే నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిందన్నారు. విజేతలను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయులు ప్రభాకర్, సుధారాణి, బి.అప్పారావు, శర్మ, ఆచంట రవి తదితరులు అభినందించారు.

రెవెన్యూ గ్రామ సభల్లో అర్జీల వెల్లువ



జి.భీమవరంలో అర్జీలను స్వీకరిస్తున్న ఆర్ఐ రమేష్

కశింకోట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జి.భీమవరంలో సోమవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ రమేష్ మాట్లాడుతూ భూ విస్తీర్ణంలో లోపాలు, పేర్లు తప్పుగా నమోదు, ఆన్‌లైన్‌లో భూ యజమాని పేర్లు నమోదు చేసుకోవాలన్నా ఈ గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్జీదారుల సమస్యలన్నీ పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఇదిలావుంటే, 83 మంది భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామారావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ, వీఆర్‌వోలు శ్రీనివాసరావు, ఉదయ్, దేవి తదితరులు పాల్గొన్నారు.



ఎరుకునాయుడుపాలెంలో డీటీకి అర్జీని అందిస్తున్న రైతులు

ఎరుకునాయుడుపాలెంలో...

సబ్బవరం : రీ సర్వే అనంతరం నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.గణేశ్ తెలిపారు. ఎరుకునాయుడుపాలెంలో గ్రామ సభ నిర్వహించి అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, గ్రామ పెద్దలు గవర అప్పారావు, మొల్లి చిన్నారావు, చల్ల అప్పలనాయుడు, గండ్రెడ్డి గోవింద్, కనుగుద్ది కనకరాజు, వీఆర్వో డి.ఈశ్వరరావు, సర్వేయర్లు ఎల్.అప్పారావు, రాంబాబు, మోహన్‌రావు, ఆదిత్య, జి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో పూడిక తొలగింపు



కాలువలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

కశింకోట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం కూడలిలో ఉన్న కాలువల్లో పూడికతీత పనులను పంచాయతీ సిబ్బంది సోమవారం చేపట్టారు. చిన్నపాటి వర్షానికే నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అక్కడివారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది గుర్తించిన కూటమి నేతలు చొరవ తీసుకొని కాలువల్లో వ్యర్థాలను తొలగించేలా ఏర్పాట్లు చేయించారు. దీంతో గ్రామ కూడలిలో వర్షపు నీరు నిలిచే పరిస్థితి ఉండదని పలువురు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే, గ్రామంలోని ప్రతి కాలువను శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతున్నారు.

జీవీఎంసీ అనకాపల్లి జోన్ ఈఈ, ఏపీడీ బదిలీ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈఈ ఎస్.చిరంజీవులు, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఏపీడీ దొర బదిలీ అయ్యారు. చిరంజీవులు పెందుర్తి జోన్‌కు బదిలీకాగా, ఆయన స్థానంలో జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగంలో ఈఈగా పనిచేస్తున్న శేఖర్ నియమితులయ్యారు. భీమిలికి బదిలీ అయిన ఏపీడీ దొర స్థానంలో అక్కడి నుంచి వై.సంతోష్‌కుమార్ అనకాపల్లికి బదిలీ అయ్యారు. ఇదిలావుంటే, ఇప్పటికే టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు బదిలీ అయి ఏడాది గడిచినా నేటికీ అధికారులను భర్తీ చేయలేదు. దీంతో భవన నిర్మాణం చేపట్టుకునే వారు ప్లాన్‌ల కోసం ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసింది.

తుమ్మపాలలో యువకుడి అదృశ్యం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్మపాల కొత్తపేట వీధికి చెందిన ఒక యువకుడు అదృశ్యమైనట్టు పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు అందింది. తుమ్మపాలకు చెందిన 20 ఏళ్ల షేక్ పాపాషా అనే ఈ నెల 18వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ లభించక పోవడంతో యువకుడి తల్లి షేక్ బీబీ ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు పాలకులు అన్యాయం

» అరకొర చెల్లింపులు చేసి చేతులు దులుపుకున్న గత వైసీపీ సర్కారు
» 28న విజయవాడలో నిర్వహించనున్న విజ్ఞాపన సదస్సు విజయవంతం చేయండి : జిల్లా గౌరవాధ్యక్షుడు భద్రం



బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎన్ భద్రం

తుమ్మపాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ బాధితులకు గత వైసీపీ ప్రభుత్వం అరకొర చెల్లింపులు చేసి చేతులు దులుపుకుందని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా అగ్రిగోల్డ్ బాధితులకు ఇస్తున్న హామీలు అమలు కాకపోవడం దారుణమన్నారు. కూటమి నాయకులు సైతం ఎన్నికల ముందు ఈ బాధితులకు న్యాయం చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి నేటి వరకు న్యాయం చేయలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించాల్సిందిగా కోరారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న విజయవాడలో నిర్వహించనున్న బాధితుల విజ్ఞాపన సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు మాణిక్యాలరావు, నాయకులు జెర్రిపోతుల దుర్గారావు, పొలమరశెట్టి శేషు, మొల్లేటి గోపాలరావు, కోన లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ముడి వీడుతోంది..!





నవ దంపతుల్లో పెరుగుతున్న అసహనం

- కొరవడుతున్న సర్దుకుపోయే తత్వం
- వేగంగా విస్తరిస్తున్న విడాకుల సంస్కృతి
- వివాహమైన ఐదేళ్లలోపే పెటాకులు

భారతీయ వైవాహిక వ్యవస్థకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, గౌరవం ఉన్నాయి. సంప్రదాయాలు, ఉమ్మడి కుటుంబాలు, పిల్లలపై తల్లిదండ్రుల ప్రేమ ఇలా అనేక అంశాలు దంపతుల మధ్య బంధం బలపడేందుకు దోహదపడుతూ వచ్చాయి. ముఖ్యంగా కాపురాలు సవ్యంగా సాగడానికి, సర్దుకుపోయే మనస్తత్వం అలవడేందుకు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఎంతో దోహదపడింది. అయితే పాశ్చాత్య పోకడలు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో విడాకుల సంస్కృతి వేళ్లూనుకుంటోంది. మాట పట్టింపులు, చిన్న చిన్న విషయాలు దంపతుల మధ్య చిచ్చు పెడుతున్నాయి. ఫలితంగా కోర్టుకు ఎక్కేవారి సంఖ్య పెరుగుతోంది.

పెళ్లంటే...పందిళ్లు, సందళ్లు, తప్పెట్లు, తాళాలు, తలంబ్రాలూ... మూడే ముళ్లు, ఏడే అడుగులు...మొత్తం కలిసీ నూరేళ్లు! ఇప్పటికీ ఈ పాటకు విశేష ప్రజాదరణ ఉంది. కానీ ప్రస్తుతం మనుషుల ఆలోచనలు మారిపోతున్నాయి. స్పీడ్ యుగంలో అన్నీ తొందరగా అయిపోవాలనే తపన పెరుగుతోంది. ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ ఇచ్చినంత వేగంగానే జీవితంలో అన్నీ జరిగిపోవాలని ప్రస్తుత తరం తలుస్తోంది. ఫలితంగా వివాహ బంధానికి విలువ లేకుండా పోతోంది. చిన్న చిన్న కారణాలకూ దంపతులు విడిపోవడం సాధారణమైపోయింది. ఏటా విడాకుల కోసం కోర్టుకు ఎక్కే జంటల సంఖ్య 20 శాతం మేర పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

విపరీత ధోరణి...

విడాకుల కోసం ఎదురుచూడడమే కాదు, మంజూరైన తర్వాత సంబరాలు చేసుకునే సంస్కృతి కూడా పెరుగుతోంది. కొందరైతే సోషల్ మీడియాలో పంచుకునేందుకు వెనుకాడడం లేదు. నచ్చనప్పుడు రాజీ పడాల్సిన అవసరమేమిటనే ధోరణి బలపడుతోంది. జిల్లా ఫ్యామిలీ కోర్టులో అధికశాతం విడాకుల కేసులే నమోదవుతున్నాయి. ఇందులో వివాహమై ఐదేళ్లు కూడా సంసారం చేయని జంటలే అధికం. వివాదాలు స్వల్పమే అయినా, పెద్దలు చేసే రాజీ ప్రయత్నాలు ఫలితమివ్వడం లేదు. కొన్నిజంటల్లో ఇద్దరూ ఉద్యోగులు కావడంతో సమయం చాలక, ఇంట్లో పనులు ఎవరు చేయాలన్న విషయంపై మొదలయ్యే వాగ్వాదాలు చివరకు విడాకుల వరకు దారితీస్తున్నాయి. ఇలాంటి కొన్ని కారణాలను పరిశీలిస్తే ఇంత చిన్న అంశాలకూ విడిపోవాలా అనిపిస్తుంది. దంపతుల మధ్య సర్దుకుపోయే మనస్తత్వం కొరవడడం జీవితాలను కబళిస్తోంది.

కొన్ని ఉదాహరణలివి...

● భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులే. ఒకరు ముంబైలో, మరొకరు హైదరాబాద్‌లో...కలిసి ఉండాలంటే ఎవరో ఒకరు ఉద్యోగం మానేయాలి. దీనిపై ఇద్దరి మధ్య అంగీకారం కుదరలేదు. విడాకులు తీసుకోవడమే మేలనుకున్నారు.

● దంపతులు ఉద్యోగులు. అందంగా ఉండడం కోసం మేకప్, ట్రెండీ వస్త్రధారణ ఆమెకు ఇష్టం. అక్కడే గొడవలు ప్రారంభం. తన తల్లిదండ్రులను సరిగా చూడడం లేదని భర్తకు కోపం. ఫలితం విడాకులు.

● భర్త ప్రతి చిన్నదానికీ కోప్పడతాడు. కన్నవారింటికి పంపించడానికి కూడా ఇష్టపడడు. చేతికి డబ్బులివ్వడు. ఫోన్ మాట్లాడనివ్వడు. దీంతో పెళ్లైన మూడు నెలలకే పుట్టింటికి తిరిగొచ్చి, పోలీసు కేసు, విడాకులు.

● భర్తకు రూ.50 వేలు జీతం. మంచి జీవితం గడపాలనుకుని మరింత ఆదాయం వచ్చే ఉద్యోగంలో చేరాలని చెప్పినా వినలేదు. వాగ్వాదాలతో తరచూ దూరమయ్యే దంపతులు విడాకులే పరిష్కారమని కోర్టుకు వెళ్లారు.

● వివాహమై ఏడాదిన్నరైనా పిల్లలు లేరు. ఒకరిపై ఒకరికి అనుమానం. నిత్యం ఫోన్లపై నిఘా. సమస్య సద్దుమణగలేదు. చివరకు పెళ్లి పెటాకులైంది.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం విడాకులకు ప్రధాన కారణంగా నిపుణులు పేర్కొంటున్నారు. భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు, మనస్పర్థలు సాధారణమేనని, ఒక ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య కూడా భిన్నాభిప్రాయాలు ఉంటాయని, వేర్వేరు కుటుంబాల నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తుల మధ్య అభిప్రాయ భేదాలు సాధారణమేనని అంటున్నారు. ఉమ్మడి కుటుంబాల్లో పెద్దలు సర్దిచెప్పేవారు. దీంతో దంపతులు తమ మాట బయటకు రావడానికి వందసార్లు ఆలోచించేవారు. పెద్దలున్నారనే గౌరవమో, అభిమానమో, భయమో వారిని కట్టి ఉంచేవి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. చిన్నచిన్న కుటుంబాలుగా మారిపోవడం, పెద్దలకు సరైన గౌరవ మర్యాదలు లభించకపోవడం వంటి అంశాలు ప్రతి చిన్న అంశాన్నీ పెద్దదిగా చూపిస్తున్నారు. ఫలితంగా విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో విడాకుల వరకూ వస్తున్న కేసుల్లో అధికశాతం విద్యావంతులు, ఉద్యోగులదేనని చెబుతున్నారు. ఈ సంస్కృతి నగరాలు, పట్టణాల్లో విపరీతంగా పెరుగుతోందంటున్నారు. విడాకులు తీసుకోవడం చట్టబద్ధమైన హక్కే. కానీ దాని వల్ల వచ్చే చిక్కులను గుర్తించి, పెద్దల సలహాలను తీసుకోవాలని, తప్పనిసరైతేనే విడిపోవాలని నిర్ణయించుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

● ఎం.వి.పి.కాలనీ, ఆంధ్రజ్యోతి

సర్దుకుపోవడం లేదు



దంపతుల్లో సర్దుకుపోయే మనస్తత్వం కొరవడుతోంది. చిన్నచిన్న కారణాలకే పరస్పర అంగీకారంతో విడాకులకు ముందుకు వస్తున్నారు. ఎదుటివారి మాటకు విలువ ఇవ్వకపోవడం, స్వేచ్ఛ కావాలనుకోవడం, తల్లిదండ్రులకు ప్రాధాన్యత ఇవ్వలేకపోవడం, ఉద్యోగం లేదా వృత్తి రీత్యా భార్యాభర్తల మధ్య దూరం పెరగడం, కుటుంబసభ్యుల మాటలకు ప్రభావితం కావడం వంటి కారణాలే కనిపిస్తున్నాయి. విడాకులు తీసుకున్నానని చెప్పుకోవడానికి ఎవరూ సంకోచించడం లేదు. గతంలో పోలీసు ఫిర్యాదులు, న్యాయస్థానాల్లో కేసులు, విచారణ అనంతరం విడాకులు తీసుకునేవారు. ప్రస్తుతం భార్యా భర్తల్లో విభేదాలు తారాస్థాయికి చేరడమో, ఇతరత్రా కారణాలతోనో విడాకులకు అంగీకరించి ముందుకు వస్తున్నారు. ఇలాంటి కేసులు నెలకు ఐదు వరకు వస్తున్నాయి.

- సూరిశెట్టి సరోజ, లీగల్ కౌన్సెలర్, డొమస్టిక్ వయలెన్స్, మహిళా శిశు సంక్షేమ శాఖ

జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు చోడవరం యువకుడి ఎంపిక



రజత పతకం సాధించిన సుందరరామారెడ్డి

చోడవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన నల్లమిల్లి సుందర రామారెడ్డి రజత పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాజమండ్రిలో ఆదివారం నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో రామారెడ్డి 200 పాయింట్లకు గాను 187 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ ప్రతిభతో డిసెంబరు నెలలో ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పట్టణానికి చెందిన వ్యాపారి గనిరెడ్డి కుమారుడైన సుందరరామారెడ్డి రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకం సాధించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పెద్దేరు జలాశయం నుంచి నీరు విడుదల

మాడుగుల రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నుంచి సోమవారం రాత్రి ఏడు గంటలకు 500 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయంలో నీటి నిల్వలు పుష్కలంగా చేరాయి. దీంతో జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, సోమవారం సాయంత్రం 265 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.60 మీటర్లకు చేరింది. దీంతో అప్రమత్తమైన జలాశయం అధికారులు మూడో నంబరు గేటు తెరిచి 500 క్యూసెక్కుల నీటిని నదీ ప్రవాహంలోకి విడిచిపెట్టినట్టు జలాశయం ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. పెద్దేరు నదీప్రవాహం పరిసర ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని, నీటి ప్రవాహంలోకి దిగరాదని ఏఈ సూచించారు.

మదుంలోకి దూసుకుపోయిన కారు

- ఒకరికి తీవ్ర గాయాలు





మదుం నుంచి కారును బయటకు తీస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) కొండలరావు

నర్సీపట్నం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి కారు పెదబొడ్డేపల్లి మదుంలోకి దూసుకు పోవడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం ఆదివారం రాత్రి జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. నర్సీపట్నం బొంబాయి బజార్ యజమాని బి.కొండలరావు బ్యాంక్ కాలనీలో నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి షాపులో పని చేసే సిబ్బందిని కారులో కోటవురట్ల మండలం జల్లూరులో వారి ఇంటి వద్ద దింపి తిరిగి నర్సీపట్నం బయలు దేరారు. పెదబొడ్డేపల్లి సెంటర్ దాటిన తర్వాత ఆర్డీవో బంగ్లా దగ్గరలో కారు అదుపుతప్పి వంతెనను ఢీ కొట్టింది. పాత వంతెన, కొత్త వంతెనల మధ్యలోంచి దూసుకు పోయి మదుంలో పడిపోయింది. కారు డ్రైవింగ్ చేస్తున్న కొండలరావు తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించారు. పెదబొడ్డేపల్లి మదుం దాటి మలుపు తిరిగితే బ్యాంక్ కాలనీలోని ఇంటికి చేరుకోవచ్చు. ఒక్క నిమిషంలో ఇంటికి చేరుకునే లోపు దురదృష్టం వెంటాడి కారు ప్రమాదంతో కొండలరావు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం నర్సీపట్నంలో గృహ ప్రవేశం జరగాల్సి ఉండగా ప్రమాదం కారణంగా వాయిదా వేసుకోవల్సి వచ్చింది.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవాలి

- న్యాయ విద్యార్థులకు డీఎస్‌ఎన్‌ఎల్‌యూ ఉప కులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు పిలుపు



జాతీయ స్థాయి ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొన్న న్యాయ విద్యార్థులు

సబ్బవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్యార్థులు మేధో హక్కులపై అవగాహన పెంచుకోవాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు అన్నారు. విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ టెక్నాలజీ (సీఐపీఆర్ అండ్ టీ), డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) సహకారంతో అబ్దుల్ కలాం 5వ ఐపీఆర్ నేషనల్ క్విజ్ పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వీసీ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, మేధో సంపత్తి హక్కుల గురించి విద్యార్థుల్లో పరిజ్ఞానాన్ని పెంచేందుకు జాతీయ స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ క్విజ్ పోటీల్లో పుణెలోని సింబయాసిస్ లా స్కూల్‌కు చెందిన కేశవ్ జైన్, సబ్యసాచినంది బృందం విన్నర్‌గా, బెంగళూరులోని అలయన్స్ వర్సిటీకి చెందిన కడిమి లక్ష్మీహర్షిత, మజ్జారి పావని బృందం రన్నరప్‌గా నిలిచాయి. వీరికి రూ.5 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు అందుకున్నారని సీఐపీఆర్ అండ్ టీ సభ్యులు డాక్టర్ నీలిమ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ కన్వీనర్, డీపీఐఐటీ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ దయానందమూర్తి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి



అర్జీదారులతో స్వయంగా మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ హితవు
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరణ

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అర్జీదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. పలువురి సమస్యలను స్వయంగా ఆలకించారు. అనంతరం ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, అర్జీదారుల సమస్యలను తమ సమస్యలుగా భావించాలని సూచించారు. కాగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 206 అర్జీలు అందినట్టు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్ఓ దయానిధి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

అనకాపల్లి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు అండగా నిలవాలని ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి వారి గోడును ఆలకించారు. పరిష్కారం నిమిత్తం అర్జీల సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. తరువాత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై దృష్టి కేంద్రీకరించాలని, నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మొత్తం 32 అర్జీలు అందగా.. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటికి సంబంధించినవి అధికంగా వున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మోహనరావు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో విజయవంతంగా అరుదైన శస్త్ర చికిత్స

- పల్మనరీ ఆర్టెరీలో గడ్డ కట్టిన రక్తాన్ని తొలగించి యువకుడి ప్రాణాలు కాపాడిన వైద్యులు



శస్త్ర చికిత్స చేసిన వైద్యులు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లోని కార్డియో థొరాసిక్ వాస్కులర్ సర్జరీ విభాగంలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యుల బృందం విజయవంతంగా పూర్తిచేసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన హరికృష్ణ (34) కొద్ది నెలలుగా తీవ్రమైన దగ్గుతో ఇబ్బందిపడుతున్నాడు. ఆరు నెలల నుంచి దగ్గుతోపాటు రక్తం పడుతోంది. అనేక మంది వైద్యులకు చూపించినా ప్రయోజనం లేకుండా పోయింది. హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు వరకు ఖర్చవుతుందని చెప్పారు. అంత మొత్తం వెచ్చించే స్థోమత లేక ఈ నెల పదో తేదీన కేజీహెచ్‌లో చేరాడు. అదేరోజు మెడికల్ వార్డు నుంచి కార్డియో థొరాసిక్ విభాగానికి వైద్యులు రిఫర్ చేశారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు థ్రాంబోస్‌గా నిర్ధారించారు. అంటే, గుండె నుంచి ఊపిరితిత్తులకు చెడు రక్తాన్ని తీసుకువెళ్లే పల్మనరీ ఆర్టెరీలో రక్తం గడ్డ కట్టడం. ఆ గడ్డను తొలగించేందుకు వైద్యులు సర్జరీకి సిద్ధమయ్యారు. శస్త్ర చికిత్స వల్ల ఒక్కోసారి రోగి ప్రాణానికి ప్రమాదం ఉంటుందన్న విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈనెల 11న సుమారు నాలుగు గంటలపాటు శస్త్ర చికిత్స నిర్వహించి పల్మనరీ ఆర్టెరీలో గూడు కట్టిన గడ్డను తొలగించారు. ఈ ప్రక్రియను వైద్య పరిభాషలో పల్మనరీ థ్రాంబో ఎంబోలెక్టమీ లేదా పల్మనరీ థ్రాంబెక్టమీ అంటారు. లంగ్స్ వరకు రక్తం గడ్డ కట్టినట్టు గుర్తించిన వైద్యులు మొత్తాన్ని తొలగించారు. దీంతోపాటు రోగి ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నాడు. శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్య బృందాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద సోమవారం ఉదయం అభినందించారు. ఈ శస్త్ర చికిత్సను కార్డియోథొరాసిక్ విభాగానికి చెందిన వైద్యుల బృందం డాక్టర్ కె.మణిత, డాక్టర్ ఎ.పద్మజ, అనస్థీషియా వైద్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ రమేష్, డాక్టర్ భవానీ నిర్వహించారు. ఈ తరహా కేసులను రాష్ట్రంలో ఎక్కడా చేయలేదని, దాదాపు 90 శాతం కేసుల్లో ప్రాణానికి ప్రమాదం ఉంటుందని, విజయవంతంగా శస్త్ర చికిత్సను పూర్తిచేయడం ఆనందంగా ఉందని డాక్టర్ పద్మజ తెలిపారు.

ఉరుసు ఉత్సవం కోసం అమ్మమ్మ ఇంటికి వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి
- సొంతూరు కాకినాడ..
- గ్యార్మీ షరీఫ్ కోసం మూడు రోజుల క్రితం పెదబోదిగల్లం రాక
- తాతతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా లారీ ఢీకొనడంతో మృత్యువాత



షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ మృతదేహం

ఎస్.రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్యార్మీ షరీఫ్ ఉరుసు సందర్భంగా సరదాగా గడుపుదామని తల్లిదండ్రులతో కలిసి అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఓ 16 ఏళ్ల బాలుడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. తాత, మనవడు కలిసి ద్విచక్రవాహనంపై అడ్డరోడ్డు జంక్షన్‌కు వచ్చి తిరిగి వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. దీంతో బాలుడికి తీవ్ర గాయలయ్యాయి. ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందాడు.. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

జిల్లా కేంద్రమైన కాకినాడకు చెందిన షేక్ మహ్మద్ యాసిన్ తన భార్య, కుమారుడు అబ్దుల్ ఖాదర్ జిలానీ (16)తో కలిసి నక్కపల్లి మండలం పెదబోదిగల్లంలో గ్యార్మీ షరీఫ్ ఉర్సు సందర్భంగా ఈ నెల 18న మావయ్య షేక్ మహమ్మద్ ఖదీర్ బాషా ఇంటికి (భార్య పుట్టిల్లు) వచ్చారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన ఉరుసు మహోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సోమవారం ఉదయం జిలానీ, తాత ఖదీర్ బాషా కలిసి సొంత పనిమీద ద్విచక్ర వాహనంపై ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డుకు వచ్చారు. పనిముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరారు. ఫ్లై ఓవర్ వంతెన దాటిన తరువాత వెనుక నుంచి వస్తున్న లారీ, ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొన్నది. వెనుక కూర్చున్న జిలానీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసినప్పటికీ పరిస్థితి విషమంగానే వుండడంతో 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. బాలుడు అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అభిజిత్ కార్మికుల ఆందోళన వాయిదా

- మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని యాజమాన్యానికి అల్టిమేటం
- లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరిక



అభిజిత్ కంపెనీ ముందు సమావేశమైన కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు

అచ్యుతాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ కంపెనీ వద్ద వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు కార్మికులు, కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఉదయం కర్మాగారం ముందు సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ కర్మాగారం యాజమాన్యం ఈ నెల 14వ తేదీ నుంచి లేఆఫ్ ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కార్మికులు కర్మాగారం వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కంపెనీ ఎదుట మోకాళ్లపై నిల్చుని, వంటావార్పు వంటి కార్యక్రమాలతోపాటు అచ్యుతాపురం జంక్షన్, తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనలు చేశారు. అయినా కర్మాగారం యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఆందోళనను మూడు రోజులపాటు తాత్కాలికంగా వాయిదా వేసి, సమస్యను పరిష్కరించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేయాలని తీర్మానించారు.

తుఫాన్‌తో అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

ప్రజలు వీటిని దాటకుండా అప్రమత్తం చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్ల వద్దని, ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులను సత్వరమే తీరానికి చేరేలా చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

కలెక్టరేట్‌లో 08924-226599, 222888 ఫోన్ నంబర్లతో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి 26వ తేదీ వరకు 24 గంటలూ అందుబాటులో వుండేలా సిబ్బందిని నియమించారు. ఎక్కడైనా విపత్కర పరిస్థితులు ఏర్పడినట్టు సమాచారం వస్తే.. వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా ఏర్పాట్లు చేశారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో మందుల కొరత

... 5వ పేజీ తరువాయి

కేటాయించింది. విశాఖ సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు మందులు, ఇంజక్షన్‌లకు అవసరం మేరకు ఇండెంట్ పెడుతున్నా తక్కువగా వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కారణంగానే మందుల కొరత ఏర్పడుతుందని అంటున్నారు. అయితే నవంబరు నెలలో మందులకు బడ్జెట్ కేటాయింపులు ఉంటాయని, అవసరం మేరకు కూటమి ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మందుల కొరత ఉన్నప్పటికీ అత్యవసర మందులను ప్రైవేటుగా కొనుగోలు చేసి రోగులకు అందిస్తున్నామన్నారు. శుక్రవారం సెంట్రల్ స్టోర్స్ నుంచి మందులు వచ్చాయన్నారు. నొప్పులు తగ్గించే ఇంజక్షన్లు రూ.లక్షా 23 వేలకు ఇండెంట్ పెట్టగా, శుక్రవారం కేవలం రూ.40వేలు మాత్రమే వచ్చాయన్నారు. పూర్తిస్థాయిలో మందులకు బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తున్నామని ఆయన చెప్పారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

... 5వ పేజీ తరువాయి

భాగంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరాలు నిర్వహించి, పోలీస్ అమరవీరుల త్యాగాలు, సేవలను తెలియజేస్తామన్నారు. అనంతరం 13 మందికి అమరవీరుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ అప్పారావు, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, పోలీస్‌అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534